


రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0 (శనివారం)
కనిష్ఠం : 25.0

నేటి నుంచి కాలువల మూసివేత 6

ఆదివారం ప్రత్యేకం

నోరూరే.. ఊరగాయ!





గ్రామంలో కుటుంబాలు : 1156 - పచ్చళ్ల తయారీ కుటుంబాలు : 800




పచ్చళ్ల పల్లెటూరు నార్కెడిమిల్లి











గోదారోళ్ల పచ్చళ్లు అంటే నోరూరాల్సిందే.. ఆ టేస్టే వేరు.. ఆ టేస్టే వేరు.. ఒకసారి తిన్నారా.. వదిలిపెట్టరు.. మళ్లీ మళ్లీ నోరూరిస్తోంది.. చూసిన వెంటనే లొట్టలేస్తారు.. అందుకే 60 ఏళ్లు అవుతున్నా ఆ ఊరి పచ్చడికి నేటికీ డిమాండ్ తగ్గలేదు.. ఎన్ని కంపెనీలు వచ్చినా ఆ ఊరు ఊరగాయకు ఏ మాత్రం డిమాండ్ తగ్గలేదు.. అంతకంతకూ పెరుగుతూనే ఉంది.. ఇంటికో పచ్చళ్ల పరిశ్రమ ఉంటుందంటే అతిశయోక్తి కాదేమో.. ఊళ్లో 1156 కుటుంబాలు ఉంటే 800 కుటుంబాలకు అదే ఆధారం. ఒకసారి పచ్చళ్ల పల్లెటూరు నార్కెడిమిల్లిని చూసొద్దామా..

ఎక్కడో మారుమూల పల్లెటూరు.. పరిసర గ్రామాల ప్రజలకు పేరు చెప్పినా అదెక్కడ అంటూ ఆలోచిస్తారు.. అయితే దేశవిదేశాల్లో మాత్రం చాలా పెద్ద ఫేమస్.. ఎందుకంటే ఆ ఊరు పచ్చళ్లకు అంత డిమాండ్.. పూతరేకులకు ఆత్రేయపురం ఫేమస్ అయితే ఊరగాయలకు నార్కెడిమిల్లి ఫేమస్.. ఆ గ్రామంలో అడుగు పెట్టగానే ఏ ఇంట చూసిన పచ్చళ్ల డ్రమ్ములు.. బస్తాల్లో ముడి సరుకు.. నోరూరించే పచ్చళ్ల సువాసనలు వెదజల్లుతుంటాయి. వశిష్ఠ గోదావరి చెంతనే ఉన్న గ్రామం పచ్చళ్లకు ఎంతో ప్రసిద్ధిగాంచింది. సుమారు ఆరు దశాబ్దాల కిందట నుంచే ఇక్కడ పచ్చళ్లు తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఇళ్ల వద్దే కుటీర పరిశ్రమగా స్థాపించి అన్ని రకాల పచ్చళ్లు సీజన్ వారీగా నిత్యం తయారుచేస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. ఇక్కడ తయారైన పచ్చళ్లు దేశంలో వివిధ ప్రాంతాలకు తీసుకుని వెళ్లి విక్రస్తుంటారు.

- ఆత్రేయపురం -ఆంధ్రజ్యోతి

60 ఏళ్లుగా అదే వ్యాపారం..

ఆరు దశాబ్దాల కిందట పచ్చళ్ల తయారీ వెలసింది. నాడు సరదాగా ప్రారంభించిన పచ్చళ్ల వ్యాపారం నేడు ప్రతి ఇంటికీ ఉపాధిగా మారింది. ఆ ఊరులో ఏ ఇంటి ఎదుట చూసినా పచ్చళ్ల డ్రమ్ములు కనిపిస్తూనే ఉంటాయి. పచ్చళ్లలో ఎటువంటి రంగులు, రసాయనాలు లేకుండా తయారుచేయడం ప్రత్యేకత. కారం, ఉప్పు, ఇతర సామగ్రి హోల్‌సేల్‌గా కొనుగోలు చేసుకుని ఎండబెట్టి శుభ్రం చేసి ఎంతో శ్రద్ధగా నాణ్యత ప్రమాణాలతో పచ్చళ్లను తయారు చేస్తారు. అందుకే 60 ఏళ్లయినా నేటికీ నోరూరుతూనే ఉన్నాయి ఆ ఊరి పచ్చళ్లు.. తయారు చేసిన పచ్చళ్లను డ్రమ్ముల్లో నిల్వ చేసి వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. అక్కడ వ్యాపారులు సైకిళ్లు, బైక్‌లు ద్వారా ఇంటింటికి వెళ్లి అమ్మకాలు సాగిస్తుంటారు. పట్టణ ప్రాంతాల్లో హోటల్స్‌కు కిలో రూ.150 నుంచి రూ.250 వరకు హోల్‌సేల్‌గా అందిస్తారు.

- నాణ్యతకు పెట్టింది పేరు
- ఇతర రాష్ట్రాల్లో డిమాండ్
- పట్టణాలకు ఎగుమతులు
- సీజన్‌కు తగినట్టు పచ్చళ్లు
- ఆ ఊరుకు అదే ఆధారం



ఆవకాయ పచ్చడి ముక్కలు



పచ్చళ్ల తయారీలో మహిళలు

ట్యాక్స్ మినహాయించాలి



నార్కెడిమిల్లి పచ్చళ్లను వివిధ రాష్ట్రాలకు తరలిస్తుంటాం. మధ్యలో సేల్స్ ట్యాక్స్ అధికారులు వేబిల్లులు పేరుతో ఇబ్బందులు కల్పిస్తున్నారు. సేల్స్ ట్యాక్స్ నుంచి విముక్తి కల్పించాలి.

- కొపెల్ల శ్రీరామ్, వ్యాపారి

రాయితీ రుణాలివ్వాలి..



చాలా ఏళ్లగా పచ్చళ్ల తయారీ జీవనాధారం. మాకు ముడి సరుకు కొనుగోలుకు రాయితీ రుణాలిస్తే మేమేంటో చూపిస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీ రుణాలు అందించి పరిశ్రమను ఆదుకోవాలి.

- మోటారి షామిలి

నార్కెడిమిల్లి టూ..

నార్కెడిమిల్లిలో ఆడవాళ్లు ఏడాది పొడవునా సీజనల్ పచ్చళ్లను తయారు చేస్తుంటారు. ఆవకాయ, మావగాయ, నిమ్మకాయ, టమాటా, పండుమిర్చి, ఉసిరి, కాకరకాయ, అల్లం, చింతకాయ, దబ్బకాయ, బెల్లం ఆవకాయ, కరివేపాకు, గోంగూర, కారంపొడులను తయారు చేస్తుంటారు. మగవారంతా ఆ పచ్చళ్లను బెంగళూరు, చెన్నై, ఒడిషా, ముంబై, హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, వైజాగ్, రాయలసీమ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేసి విక్రస్తుంటారు. ఎన్నో ఏళ్లగా వీరికిద్దే జీవనాధారం. గ్రామంలోని మగవాళ్లంతా ఈ పచ్చళ్లతో దేశవ్యాప్తంగా వ్యాపారాలు సాగిస్తారు. పండుగలు, ఎన్నికలు, శుభకార్యాలకు మాత్రమే గ్రామాలకు వస్తారు.

స్పౌజ్ పింఛన్లకు దరఖాస్తులు స్వీకరణ

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్పౌజ్ పింఛను ప్రక్రియ శనివారం నుంచి సచివాలయాల్లో ప్రారంభమైందని మంత్రి దుర్గేష్ తెలిపారు. 60 ఏళ్లు నిండి అప్పటికే పింఛను తీసుకుంటున్న భర్త 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్య కాలంలో మరణిస్తే..అతడి భార్య స్పౌజ్ పింఛనుకు దరఖాస్తుకు అర్హురాలన్నారు. భర్త, భార్య ఆధార్ కార్డులు, పింఛను పుస్తకం, రేషన్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రాల జిరాక్సు కాపీలను అందజేయాలన్నారు.పింఛను లబ్ధిదారుకాని భర్త మరణిస్తే ఆ కుటుంబానికి కొత్తగా వితంతు పింఛనుకు దరఖాస్తు చేయడానికి ఆప్షన్ రాలేదన్నారు. గతంలో పింఛను తీసుకుంటూ మరణిం చిన వారి భార్య మాత్రమే అర్హురాలన్నారు.

పాకిస్థానీయులు దేశం విడిచి వెళ్లాలి

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పాకిస్థానీయులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన భారత వీసాలను రద్దు చేసిన నేపథ్యంలో ఆయా వీసాలపై జిల్లాలో ఉన్న వాళ్లు దేశం వెళ్లాలని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించిందని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆదేశాలు జారీ చేసిందన్నారు. వీటి ప్రకారం సాధారణ వీసాలపై వచ్చిన వాళ్లు ఈ నెల 27(నేడు)లోపు, వైద్య వీసాలపై వచ్చిన వాళ్లు 29లోపు (మంగళవారం) తిరుగు ప్రయాణం కావాలన్నారు. ఈ నెల 30 తర్వాత అట్టారీ సరిహద్దును మూసివేస్తున్నట్టు ఇప్పటికే కేంద్రం ప్రకటించిందని గుర్తు చేశారు.పాకిస్థాన్ నుంచి ఆయా వీసాలపై భారత్‌కి వచ్చి జిల్లాలో ఉంటున్న వారిని తక్షణమే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోలను ఇప్పటికే ఆదేశించామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పరిశీలన చేశామని జిల్లాలో ఆయా వీసాలపై ఉన్న పాకిస్థానీయులు ఎవరూ లేరని పోలీసులు తెలిపారు. ఎవరైనా ఉంటే స్థానికులు సమాచారం ఇవ్వాలన్నారు.

రఘుదేవపురం సర్పంచ్ చెక్ పవర్ రద్దు

సీతానగరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : నిధులు దుర్వినియోగం నేపథ్యంలో రఘుదేవపురం సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల చెక్‌పవర్‌ను రద్దుచేసినట్టు ఎంపీడీవో ఎం.భారతి శనివారం తెలిపారు. రఘుదేవపురం పంచాయతీలో రూ1.03 కోట్లు దుర్వినియోగం అయ్యాయన్నారు. విచారణ అనంతరం గతంలో పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం సర్పంచ్ చంద్రలీల చెక్ పవర్ రద్దు చేసినట్టు డీపీవో ఉత్త ర్వులు విడుదల చేశారన్నారు.ఎంపీడీవో భారతికి పంచాయతీ చెక్ పవర్ ఇచ్చారు.



ఫిర్యాదుదారు కోలా వరలక్ష్మితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి..చిత్రంలో ఆర్‌డీవో రాణిసుస్మిత

అమ్మా నాన్నలను.. అనాథలను చేయవద్దు!

తమను పిల్లలు చూడడంలేదని వృద్ధ దంపతుల కేసు

- విచారించిన కలెక్టర్ ప్రశాంతి
- తల్లిదండ్రులను చూడడం బాధ్యత
- నెలకూ రూ.5 వేలివ్వాలని ఆదేశం

రాజమహేంద్రవరం/దేవరపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మా ఇద్దరు కుమారులు మమ్మల్ని చూడడంలేదని.. రోజు గడవడమే కష్టంగా మారిందని వృద్ధాప్యంలో తల్లిదండ్రులు అధికారులను ఆశ్రయించిన ఘటన ఇది. మండలంలోని యాదవోలు గ్రామానికి చెందిన కోలా వరలక్ష్మి, కృష్ణమూర్తి దంపతులకు ఇద్దరు కుమారులు.. ఇద్దరినీ పెంచి పెద్ద చేసి పెళ్లిళ్లు కూడా చేశారు.వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో దంపతులిద్దరికీ ఇబ్బందికరంగా మారింది. ఈ మేరకు తమను ఇద్దరు కుమారులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ సీనియర్ సిటిజన్ చట్టం కింద వయోవృద్ధుల పోషణ, సంక్షేమ ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేశారు. రాజమహేంద్ర వరం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో ఆర్‌డీవో రాణిసుస్మిత ఫిర్యాదుదారులైన కోలా వరలక్ష్మి, కృష్ణమూర్తి దంపతుల సమక్షంలో కేసు విష యమై కోర్టు నిర్వహించారు.గతంలో జారీ చేసిన ఉత్తర్వుల అమలుపై సమగ్ర నివేదిక ఆధారంగా విచారణ చేపట్టడం జరిగింద న్నారు. తల్లిదండ్రులను వృద్ధాప్యదశలో చూడకపోవడం దారుణమన్నారు.ఈ రోజు వృద్ధులయ్యారని ఇలా వదిలేస్తున్నారని..పిల్లలను చిన్నతనంలో వదిలేస్తే ఏమైపోయేవారని ప్రశ్నించారు. వృద్ధులైన తల్లిదండ్రులను నిర్లక్ష్యంగా వదిలివేయడం తగదన్నారు. ఇద్దరు పిల్లలు ప్రతి నెల రూ.5 వేలు చొప్పున చెరో రూ.2500 చెల్లించాలని ఆదేశించారు. ఇది అమలయ్యేలా చూడాలని ఆర్‌డీవోకి సూచిం చారు.వృద్ధులైన తల్లి దండ్రులను భారంగా భావించవద్దన్నారు.



ఆదుకోండయ్యా..

అప్పటి వరకూ తమకు నీడనిచ్చిన గూడు అగ్నికి ఆహుతైంది.. దీంతో 3 కుటుంబాలు నిరాశ్రయులయ్యారు..బాధితులను పరామర్శించడానికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వెళితే ఇలా ఆదుకోండయ్యా అంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

- వివరాలు 7లో

అధికారుల అప్రమత్తం

జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో అధికారు లు అప్రమత్తమయ్యారు. ఎక్కడికక్కడ తనిఖీలు ముమ్మరం చేశారు.జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశాలతో శనివారం విమానాశ్రయం, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, పెట్రోలు బంకులు తదితర చోట్ల తూర్పు గోదావరి పోలీసులు శనివారం సేఫ్టీ, సెక్యూరిటీ ప్రమాణాలను పరిశీలించారు. నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన చర్యలు, సీసీ కెమెరాల పని తీరు, అసాంఘిక శక్తుల కదలికలు, అత్యవసర ప్రవేశ, నిర్గమ మార్గాలు, అగ్నిమాపక ఏర్పాట్లు వంటి వాటిపై సమీక్షించారు. మరింత మెరుగైన చర్యలు తీసుకునే అవసరతపై ఆరా తీశారు. ఎక్కడా ఎటువంటి పొర బాట్లకు తావివ్వొద్దని.. నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లోనూ ముమ్మర తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(ఏఆర్) ఎల్.చెం చిరెడ్డి, ఎస్బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ఏఆర్ డీఎస్పీ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.





విమానాశ్రయం, రైల్వే స్టేషన్‌లో పోలీసుల తనిఖీలు



ఐ..హోప్ లాండ్!

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

- సాగరంలో పర్యాటకుల సరదా
- హోప్‌ఐలాండ్, లైట్‌హౌస్ షికారు
- రోజూ నాలుగు స్పీడ్ బోట్లు
- ఒక్కో బోటులో నలుగురు
- ఒక్కొక్కరికి టిక్కెట్ రూ.2,500
- రోజంతా విహారానికి రూ.10 వేలు
- త్వరలో ఆన్‌లైన్‌లో టికెట్లు బుకింగ్
- కోరంగిలో నేరుగా టిక్కెట్ల సేల్స్

ఆరేళ్లగా నిలిచిపోయిన సముద్రంలోని హోప్ ఐలాండ్ బోటు షికారు మళ్లీ మొదలుకాబోతోంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న పర్యాటకులకు అటవీశాఖ తీపికబురు అందించింది. కోరంగి అభయారణ్యం నుంచి హోప్ ఐలాండ్, కోరంగి నుంచి భైరవపాలెంలోని బ్రిటిష్ కాలం నాటి లైట్‌హౌస్‌కు రెండు వేర్వేరు రూట్లలో స్పీడ్ బోట్లు నడపాలని నిర్ణయించింది. ఇటీవల ట్రయల్ రన్ పూర్తి చేసి పర్యాటకుల కోసం బోట్లను రెండు రోజుల కిందట సిద్ధం చేసింది. రాజమహేంద్రవరం, దిండి వద్ద గోదావరిలో బోటు షికారుకు ఆదరణగా ఎక్కువగా ఉండడంతో త్వరలో కొత్తగా మరో మూడు స్పీడ్ బోట్లను కొనుగోలు చేసి తిప్పడానికి రాష్ట్ర పర్యాటకశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.

సీఎం చంద్రబాబు చొరవ

సీఎం చంద్రబాబు కొన్నినెలల కిందట అధికారులతో నిర్వహించిన సమీక్షలో హోప్‌ఐలాండ్‌కు బోటు షికారును ప్రారంభించాలనే దానిపై చర్చ జరిగింది. అటు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లా మంత్రిగా ఉండడం, ఎన్నికల సమయంలో హోప్‌ఐలాండ్ పర్యాటకంపై ఆయన హామీ ఇచ్చిన నేపథ్యంలో వేగంగా దీన్ని ప్రారంభించాలని అధికారులకు సీఎం సూచించారు. దీంతో రూ.2 కోట్లతో కొత్త బోటు కొనుగోలు చేయాలని అధికారులు భావించినా ఆచరణలోకి రాలేదు. కొన్ని వారాల కిందట ప్రభుత్వం అటవీశాఖను రంగంలోకి దించడంతో హోప్ ఐలాండ్‌కు బోటు షికారును ప్రారంభించడానికి ఏర్పాట్లు పూర్తిచేసింది. తన వద్ద ఉన్న నాలుగు స్పీడ్ బోట్లకు ఇటీవల కొత్తగా ఇంజన్లను కొనుగోలు చేసి సిద్ధం చేసింది. ఇటీవల ట్రయిల్‌రన్ పూర్తి చేసి సర్వీసులు నడపానికి సిద్ధమైంది.

గోదావరిలో హాయ్‌హాయ్..

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కోనసీమ జిల్లాలోని దిండిలో పర్యాటకశాఖ ఎప్పటి నుంచో గోదావరిలో బోటు షికారు నిర్వహిస్తోంది. ఘాట్‌ల నుంచి ఇరవై నిమిషాలపాటు స్పీడ్ బోట్‌ల్లో పర్యాటకులను తిప్పుతున్నారు. ప్రస్తుతం రాజమహేంద్రవరంలో పర్యాటక శాఖ, ప్రైవేటువి కలిపి మూడు, దిండిలో ఒకటి ఉన్నాయి. వీటికి పర్యాటకుల నుంచి ఆదరణ అధికంగా ఉంటోంది. ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో రోజుకు 700 మంది వరకు గోదావరిలో విహరిస్తున్నారు. పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో మరో మూడు స్పీడ్ బోట్లు కొనుగోలుకు పర్యాటక శాఖ నిర్ణయించింది. వీటిని రెండు రాజమహేంద్రవరం, ఒకటి దిండిలో తిప్పాలని భావిస్తోంది. ఒక్కో బోటు రూ.14 లక్షల ఖరీదు ఉంటుంది.

ఆరేళ్ల కిందట నిలిపివేత..

2019 సెప్టెంబర్‌లో గోదావరిలో కచ్చులూరు వద్ద బోటు ప్రమాదం నేపథ్యంలో గత వైసీపీ ప్రభుత్వం హోప్ ఐలాండ్‌కు బోటు షికారును నిలిపివేసింది. పర్యాటకుల నుంచి ఒత్తిడి పెరగడంతో 2023లో హోప్ ఐలాండ్‌కు బోటు షికారు ప్రారంభించడానికి ఏపీటీడీసీ ప్రయత్నించింది. పాత బోటు మేజువాణిని తిరిగి ప్రారంభించడానికి సిద్ధపడింది. కానీ సముద్రంలో ప్రయాణించడానికి కావాల్సిన ఫిట్‌నెస్ లేకపోవడంతో బోటుకు కాకినాడ పోర్టు లైసెన్సు తిరస్కరించింది. కొత్త బోటు కొనాలనుకున్నా గత వైసీపీ సర్కారు పర్యాటకశాఖకు అనుమతివ్వలేదు. ప్రైవేటు పార్టీల ద్వారా 50 సీట్లతో బోటు షికారు ప్రారంభించడానికి ప్రైవేటు ఏజన్సీల నుంచి బిడ్లు ఆహ్వానించినా కార్యరూపం దాల్చలేదు.

కళ్లను కట్టిపడేస్తాయి..

కాకినాడ అంటే పర్యాటకులకు ఠక్కున గుర్తొచ్చేది హోప్ ఐలాండ్. సుమారు 200 ఏళ్ల కిందట సముద్రం మధ్యలో 16 కిలోమీటర్ల మేర సహజసిద్ధంగా ఏర్పడ్డ ఈ ద్వీపం కాకినాడను రక్షణ కవచంలా కాపాడుతోంది. ఈ ఐలాండ్ పర్యాటకులకు పంచే ఆనందం అంతా ఇంతా కాదు. దీన్ని చూడ్డానికి రెండు కళ్లు చాలవు.అందుకే దూరప్రాంతాల నుంచీ వచ్చి పర్యాటకులు వాలిపోతారు. చుట్టూ నీలిసముద్రం.. నీటిపై తేలియాడుతూ కట్టిపడేసే మడ అడవులు ప్రకృతి ప్రియులకు మాటల్లో వర్ణించలేని అనుభూతి అందిస్తాయి.

టిక్కెట్ ధర రూ.2500

కోరంగి అభయారణ్యం నుంచి బయలుదేరే బోట్లు హోప్ ఐలాండ్‌కు ఒకరూట్, కోరంగి నుంచి భైరవపాలెంలోని బ్రిటిష్‌కాలం నాటి లైట్‌హౌస్ వద్దకు మరో రూట్ చొప్పున రోజు నాలుగు స్పీడ్‌బోట్లు నడవనున్నాయి. వాస్తవానికి చొల్లంగి వద్ద అభయారణ్యం నుంచి హోప్ ఐలాండ్‌కు బోట్లలో మూడు గంటలు పడుతుంది. స్పీడ్‌బోట్‌లో గంటన్నరలో వెళ్లవచ్చు.అటు బ్రిటిష్‌కాలంలో కోరంగికి నౌకలు రావడం కోసం భైరవపాలెంలో నిర్మించిన లైట్‌హౌస్ చూడ్డానికి ఎందరో ఇష్టపడతారు. ఈ రెండు మార్గాల్లో సముద్రంలో షికారుకు వెళ్లే పర్యాటకులకు టిక్కెట్ ఒక్కరికి రూ. 2,500 చొప్పున నిర్ణయించారు. నలుగురు ప్రయాణించే ఈ స్పీడ్‌బోట్ ఒకసారి హోప్ ఐలాండ్, లైట్‌హౌస్‌కు వెళ్లి రావడానికి డీజిల్ రూ.6 వేలు అవుతుందని అధికారులు చెబుతున్నారు. అందుకే టికెట్ ధర రూ.2,500 చొప్పున నిర్ణయించామని తెలిపారు. ఈ స్పీడ్ బోట్‌లో సముద్రంలో నచ్చినచోటకు వెళ్లి రావడానికి రూ.10 వేలకు అద్దెకు ఇవ్వాలని అటవీశాఖ నిర్ణయించింది. పర్యాటకులే సొంతంగా డీజిల్ కొట్టించుకోవాలి. హోప్ ఐలాండ్ షికారుకు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకునేలా ఏర్పాట్లు పూర్తయ్యాయి. కోరంగి వద్ద ఆదివారం నుంచి టిక్కెట్లు విక్రయిస్తారు.

షికారు..

ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న కార్ల అమ్మకాలు
ఖరీదైన కార్లకు యమా డిమాండ్
కొత్త మోడళ్లపై పెరుగుతున్న మోజు





(కాకినాడ కార్పొరేషన్-ఆంధ్రజ్యోతి)

కారులో షికారుకెళ్తే చాలా సౌకర్యంగా ఉంటుంది. ఇదివరకు కారు ఒక విలాసం. తర్వాత అవసరంగా మారింది. తర్వాత కారు ఉండడం సాధారణమైపోయింది. దాంతో ఏ బ్రాండ్ కారు వాడుతున్నారనేది ఒక హోదాగా మారింది. ఇప్పుడు ట్రెండ్ ఇదే. కారు ఉందా లేదా అనేది కాకుండా ఏ మోడల్ కారు వాడుతున్నారంటూ మాట్లాడుకునే రోజులు నడుస్తున్నాయి. ఇటీవల కాలంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కార్ల అమ్మకాలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీనికి పైన చెప్పినవే కారణాలు కాదు.. యువతలో పెరుగుతున్న ఆసక్తి, వ్యాపారుల్లో పెరుగుతున్న మోజు, రాజకీయాల్లో ఉన్న ఆర్థికశక్తి, ప్రపంచంతో పెరుగుతున్న కనెక్టివిటీ, విలాసవంతమైన జీవితానికి భారతీయులు పడుతున్న ఆశ.. సంఘంలో గొప్పగా కనిపించాలనే అత్యాశ.. వంటి కారణాలూ కార్ల కొనుగోలుపైనా ప్రభావం చూపిస్తున్నాయి. దీంతోపాటు వృత్తిపరమైన వ్యాపారపరమైన అవసరాలకు కారు కచ్చితంగా కావాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కార్లు కొనుగోళ్లు, అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. లగ్జరీ కార్ల వినియోగంలోనూ మన ప్రాంతం దూసుకెళ్తోంది. అత్యాధునిక మోడల్ ఏదొచ్చినా కొనుగోలు చేయడానికి వాహన ప్రియులు సిద్ధంగా ఉంటున్నారు. ఏ కంపెనీ? ఏ సిరీస్? ఖరీదు ఎంత? భద్రత చర్యలు ఏంటి? ఇలా అనేక కోణాల్లో వాహనదారులు ఆరా తీస్తున్నారు. నచ్చితే లక్షలు దాటి కోట్ల వరకు విలువ చేసే కారైనా ఇట్టే కొనేస్తున్నారు. మహా నగరాల్లో విలాసవంతమైన కనిపించే కార్లు ఇప్పుడు మన ప్రాంతంలోనూ తరచు కనిపిస్తున్నాయి. ఈ తరహా విలాసవంతమైన వాహనాల అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయి. కనీసం రూ.10 లక్షలు మొదలుకొని కోట్ల విలువచేసే కార్లు అమ్ముడుపోతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో కార్ల కొనుగోళ్లు..

సంవత్సరం	అమ్మకాలు
2018	3198
2019	2749
2020	2316
2021	3350
2022	3194
2023	3540
2024	2980
2025 ఏప్రిల్ 26వరకు	939

ఇవన్నీ కొత్త కార్ల కొనుగోలుకు సంబంధించిన గణాంకాలు. ఈ గణాంకాల్లో 2024లో కొంత మేర కార్ల కొనుగోళ్లు తగ్గినా ఈ ఏడాది అత్యధికంగా కొత్త కార్ల కొనుగోళ్లు జరుగుతాయని రవాణా శాఖ అంచనా వేస్తోంది. దీనికితోడు పాత కార్ల అమ్మకాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. మధ్య తరగతి వర్గంతోపాటు ఉద్యోగ వర్గం ప్రధానంగా కార్లను కొనుగోలు చేస్తుండడంతో ఆ మేరకు ఆయా అమ్మకాలు జరుగుతున్నాయని ఆ శాఖ అధికారులు తెలిపారు.

ఏఏ ధరల్లో ఎన్ని కార్లు కొనుగోలు చేశారు..

సంవత్సరం	10 లక్షల్లోపు	20 లక్షలు	30 లక్షలు	30 లక్షలకుపైగా
2022	966	690	99	20
2023	1652	1204	205	70
2024	1321	1065	203	64
2025 ఏప్రిల్ 26	466	370	62	41

లైఫ్ ట్యాక్స్‌తో భారీ ఆదాయం..

ఖరీదైన వాహనాలతో వచ్చే లైఫ్ ట్యాక్స్‌తోను రవాణాశాఖకు భారీ స్థాయిలో ఆదాయం సమకూరుతోంది. రూ.20 లక్షలు ఆపై విలువజేసే కార్లు 18 శాతం లైఫ్‌ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. బిజినెస్, పొలిటికల్ రంగాల ప్రముఖులు ఇతరులకు భిన్నంగా ఉండాలనే కాన్సెప్ట్, అందులో ఉండే భద్రతాపరమైన అంశాలతో ఎక్కువగా ఖరీదైన కార్లను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. రియల్ ఎస్టేట్, ఇతర కంపెనీల పేరుపై కూడా ఖరీదైన వాహనాలను కొనుగోలు చేస్తున్నారు.



లగ్జరీ కార్లకు ఆదరణ పెరిగింది



విలాసవంతమైన కార్లకు డిమాండ్ పెరిగింది. చాలామంది డబ్బులు ఎంతైనా వెచ్చించి నచ్చిన కార్లను కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా కంపెనీలు తమ వాహనాల్లో భద్రతాపరమైన ఫీచర్లను విభిన్న రకాలుగా అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. ప్రమాదం జరిగినా తప్పించుకునే రక్షణ కల్పించే భద్రత వ్యవస్థ ఉన్న వాహనాలకు ఎన్ని కోట్లు అయినా వెచ్చిస్తున్నారు.

- శ్రీధర్, డీటీసీ, కాకినాడ జిల్లా

బండెనక బండి కట్టి...



ఈ చిత్రాన్ని చూస్తుంటే బండెనక బండి కట్టి అనే సినిమా పాట గుర్తుకొస్తోంది కదూ... కొన్ని ప్రాంతాల్లో పంట పొలాల నుంచి ధాన్యాన్ని తీసుకువచ్చేందుకు సరైన మార్గాలు, పుంతరోడ్లు లేకపోవడంతో ధాన్యం తరలించాలంటే ఎడ్ల బండ్లే ఆధారం. శనివారం కాకినాడ జిల్లా గొల్లప్రోలు, సీతానగరం పొలాల నుంచి ధాన్యాన్ని ఇలా ఎడ్ల బళ్లపై తరలిస్తుండగా 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది. -గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి)



రావి ఆకులా...

కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో శనివారం వింత కీటకం దర్శనమిచ్చింది. రావి ఆకు మాదిరిగా ఉన్న ఇది గొల్లభామలా సంచరించింది. దీనిని పలువురు ఆసక్తిగా తిలకించారు.

- ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి)

మామిడికి ఆర్గానిక్ కవర్ల రక్షణ



మధుర ఫలం మామిడి చెట్ల రక్షణకు రైతులు వినూత్నంగా ఆలోచించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రైతులు మామిడి కాయలు, పండ్లకు చీడపీడలు ఆశించకుండా వాటి చుట్టూ ఆర్గానిక్ కడుతున్నారు. బెంగళూరు నుంచి రూ.6వేలు విలువైన 3వేల కవర్లు కలిగిన ప్యాకెట్లను తెప్పించి వినియోగిస్తున్నారు. ఇవి మంచి ఫలితాలు ఇస్తున్నాయని ధర్మవరానికి చెందిన మామిడి రైతులు కొనగాల గోపి, వీరబాబు తెలిపారు.

- ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి)

భక్తవత్సల గోవిందా.. గోవింద

● వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం ● స్వామివారి ఆదాయం రూ.56.53 లక్షలు





వాడపల్లి వెంకన్న ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

ఆత్రేయపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మిహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవలద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.56.53లక్షలు లభించినట్లు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధర రావు తెలిపారు.

రసాయనాలతో పండ్లను మాగబెట్టి

విక్రయిస్తే కఠిన చర్యలు

● తూర్పుగోదావరిజిల్లా జేసీ చిన్నరాముడు




సదస్సులో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పండ్లను రసాయనాలతో మాగబెట్టి విక్రయిస్తే అటువంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు హెచ్చరించారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని మార్కెట్‌యార్డు సమీపంలో రైతులు, వినియోగదారులు, వ్యాపారస్తులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సహజసిద్ధంగా పండ్లను మాగబెడితే ప్రజల ఆరోగ్యానికి హాని కలగదని, దీనిపై రైతులు, వ్యాపారస్తులు ఆలోచన చేయాలని అన్నారు. కృత్రిమంగా కాల్షియం కార్బైడ్ వంటి హానికర రసాయనాలతో పండ్లను మాగబెట్టడంవల్ల ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు. ఇలాంటి పండ్లు తినడంవల్ల శ్వాసకోశ వ్యాధులు, గుండెజబ్బులు, జీర్ణ సంబంధ సమస్యలు వస్తాయని అన్నారు. ప్రజలందరూ ఈ విషయాన్ని అవగాహన చేసుకోవాలని, ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంచుకోవాలని కోరారు. కృత్రిమ పద్దతుల్లో పండ్లను మాగబెట్టే వారికి 6 నెలల జైలు, రూ.5 లక్షలు జరిమానా విధిస్తామన్నారు. జిల్లా ఆహారభద్రత అధికారి రుక్కయ్య మాట్లాడుతూ కృత్రిమంగా రసాయనాలతో పండ్లను మాగబెడితే వారి వ్యాపార లైసెన్సులను రద్దు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సునీల్‌వినయ్, జిల్లా ఉద్యాన అధికారి బి.సుజాతకుమారి, ఎంవీఐ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డెల్టా కాలువలు

మూసివేత



ధవళేశ్వరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి):రబీ అనంతరం ఖరీఫ్ నాటికి పంట కాలువలను సిద్ధం చేయడానికి కాల్వలపై ఉన్న లాకులు, షట్టర్‌లు వంటి వాటికి మరమ్మతులు చేయడానికి వీలుగా డెల్టా కాలువలను నేటి నుంచి మూసివేసి జూన్‌లో ఖరీఫ్‌కు నీటిని విడుదల చేయనున్నారు. ఆదివారం ఉదయం నుంచి డెల్టా కాలువల నీటి విడుదలను క్రమంగా తగ్గిస్తూ సాయంత్రానికి హెడ్ స్లూయిస్‌ల గేట్లను పూర్తిగా దించివేసి నీటి విడుదలను నిలిపివేయనున్నారు. ప్రస్తుతం తూర్పుడెల్టాకు 300 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 700క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 3వేల క్యూసెక్కులు విడుదలవుతున్నాయి.

శృంగారవల్లభస్వామికి నీరా'జనం'



పెద్దాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తొలి తిరుపతి క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. శ్రీదేవి, భూదేవి సమేత శృంగారవల్లభస్వామిని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారికి నిత్య కైంకర్యాలను అర్చకస్వాములు అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నా రాయణాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుమారు 15వేల మంది దర్శించు కోగా ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2.32, 590, అన్నదాన విరాళాల ద్వారా రూ.58,07 3, కేశఖండన ద్వారా రూ.9,360, తులాభారాల ద్వారా రూ.700, లడ్డూ ప్రసా దం ద్వారా రూ.22,395.. మొత్తం రూ.3,23, 118 ఆదాయం వచ్చిందని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం పులిహోర ప్రసాదం పంపిణీ చేయగా నాలుగువేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

కొంగొత్త ఆవిష్కరణలకు వేదికగా ఇన్నోవేషన్ హబ్

● జేఎన్‌టీయూకేలో క్వాంటమ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సదస్సు
● ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి



జ్యోతిప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి

కాకినాడ (సర్పవరంజంక్షన్), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా తీర్చిదిద్దడం, కొంగొత్త ఆవిష్కరణలకు వేదికగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు, రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించినట్లు ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొ. కె.మధుమూర్తి పేర్కొన్నారు. శనివారం కాకినాడ జేఎన్‌టీయూ ప్రాంగణంలోని అలూమ్ని ఆడిటోరియంలో యూసీఈకే కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) విభాగం ఆధ్వర్యంలో క్వాంటమ్ ఎకోసిస్టమ్స్ టెక్నాలజీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూఇటీసీఐ), నేషనల్ క్వాంటమ్ మిషన్ (ఎన్‌క్యూఎం)ల సంయుక్త సహకారంతో రెండురోజుల పాటు జరిగే అవగాహన సదస్సును క్యూఇటీసీఐ ఫౌండర్, సీఈవో రీనా దయాల్, వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్‌లతో కలసి జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ అమరావతి కేంద్రంగా ఏర్పాటైన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు రాష్ట్రంలోగల అనంతపురం, తిరుపతి, విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం నగరాల్లో ప్రముఖ పరిశ్రమలు స్పోక్స్ హబ్‌కు వ్యవహరిస్తాయన్నారు. క్వాంటమ్ అల్గారిథమ్‌వల్ల ట్రేడింగ్ స్ట్రాటజీలు, రిస్క్ అసెస్‌మెంట్, పోర్ట్ ఫోలియో మేనేజ్‌మెంట్‌ను ఆప్టిమైజ్ చేయ డం ద్వారా మార్కెట్లలో గణనీయమైన ప్రయోజనం లభిస్తుందన్నారు. వాతావరణ నమూనాలను మెరుగుపరచడంతో పాటూ వాతావరణమార్పులను బట్టి మెరుగైన ఉపశమన, అనుసరణ వ్యూహాల అభివృద్ధి సహాయపడటంతో పాటూ ఇతర రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులతో భవిష్యత్‌కు మరింత మెరుగుపడుతుందన్నారు. ఎన్ఈపీ 2020కు అనుగుణంగా సాంప్రదాయ డిగ్రీ కోర్సులను ప్రొఫెషనల్ కోర్సులుగా రూపకల్పనచేసి క్వాంటమ్ కంప్యూటరింగ్, ఏఐ అండ్‌ఎంఎల్ పాఠ్యాంశాలు ఉండేలా నూతన పాఠ్యప్రణాళిక రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. క్యూఇటీసీఐ ఫౌండర్, సీఈ వో రీనాదయాల్ మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా క్వాంటమ్ టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా వాస్తవ ప్రపంచంలో ముందున్న అవకాశాలపై నిపుణులు అవగాహన కల్పించడంతో పాటూ అనుభవాలను పంచుకుంటారన్నారు. పర్యావరణ వ్యవస్థకు మద్దతుగా క్వాంటమ్ ఎకో సిస్టమ్స్ టెక్నాలజీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పని చేస్తుందన్నారు. అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యాలను పెంచవచ్చన్నారు. జేఎన్‌టీయూకే వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తు త ఆధునిక సాంకేతికత కాలంలో క్వా ంట మ్ సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం అద్భుతమైన పురోగతి సాధిస్తోందన్నారు. దేశాన్ని క్వాంటమ్ టెక్నాలజీ, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ముందంజలో ఉంచేందుకు ఉపయోడపడుతుందన్నారు. ఔషధ ఆవిష్కరణ, అంతరిక్ష పరిశోధన, బ్యాంకింగ్ భద్రత, సుస్థిరాభివృద్ధిలకు దోహదపడుతుందన్నారు. రతన్‌టాటా హబ్ ద్వారా రాబోయే ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు ఏర్పాటయ్యేలా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, తద్వారా లక్ష మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయనారు. ఈ సందర్భంగా రీసోర్సు పర్సన్లు డాక్టర్ జేబీవీ రెడ్డి, డాక్టర్ సుందర్ బాలకృష్ణ, శంతనుశర్మ, జి.శ్యామ్‌సుందర్, సంతోష్‌కుమార్, డాక్టర్ అనిందిత బెనర్జీలు పవర్‌పాయింట్‌ప్రజెంటేషన్ ద్వారా అవకాహన కల్పించారు. కార్యక్రమంలో యూసీఈకె ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.మోహనరావు, ఐక్యూఏసీ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్, సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.సుమలత, రెక్టార్ కేవీరమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వీ.రవీంద్రనాథ్, ఓఎస్ డీ ప్రొఫెసర్ కోటేశ్వరరావు, పలు విభాగాధిపతులు, జేఎన్‌టీయూకె, అనుబంధ కళాశాలలు, పలు రాష్ట్రాలలోని ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.



తైలాభిషేకాలకు బారులుతీరిన వేలాది మంది భక్తులు

శనిత్రయోదశికి పోటెత్తిన భక్తులు

● స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.24.41లక్షలు

కొత్తపేట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి):మందపల్లి శనేశ్వర(మందేశ్వర)స్వామివారి ఆలయానికి శనివారం తనిత్రయోదశి సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలకు, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.24,41,386 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

రేపు డీఎస్సీ 2025 ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన కాపు అభ్యర్థులు (కాపు, బలిజ, తెలగ, ఒంటరి) లు డీఎస్సీ 2025 యస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లు కోసం ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమానికి ఆన్‌లైన్‌లో ఈనెల 28వ తేదిలోపు దరఖాస్తులు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకుడు ఏ.శ్రీనివాసరావు తెలిపారు. ఈమేరకు శనివారం ఒకప్రకటన విడుదలచేశారు. ఆన్‌లైన్ దరఖాస్తులు ఈనెల 25 నుంచి స్వీకరిస్తున్నారని తెలిపారు. హెచ్‌టిటిపిఎస్://ఎండిఎఫ్‌సి.ఏపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని తెలిపారు. అర్హతగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈనెల 28తో గడువు ముగుస్తుందని ఆయన తెలిపారు.

పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల పనులను వేగంగా పూర్తి చేస్తాం

● రూ.1061 కోట్లతో గుంతల రహితంగా రాష్ట్రంలో రహదారులు
● ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
● కాకినాడ జిల్లాలో పలుచోట్ల పర్యటన


కాకినాడ గేట్‌వే పోర్టు వద్ద అధికారులతో మాట్లాడుతున్న మంత్రి జనార్దన్‌రెడ్డి

కాకినాడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తామని ఆర్అండ్‌బీ, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన కాకినాడ జిల్లాలో పర్యటించారు. ముందుగా మారిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్‌ఆదిత్య, పోర్టు అధికారులు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, జడ్పీ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్‌లతో కలిసి తొండంగి మండలం పెరుమాళ్లపురం వద్ద అరబిందో ఇన్‌ఫ్రా ఆధ్వర్యంలో జరుగుతున్న కాకినాడ గేట్‌వే పోర్టు పనులను, అనంతరం ఉప్పాడ తీరంలో ఫిషింగ్ హార్బర్ పనులను, కాకినాడ యాంకరేజ్ పోర్టులోని బార్జిల్లోకి లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కాకినాడ పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసేందుకు వచ్చామన్నారు. కాకినాడ గేట్‌వే పోర్టు లిమిటెడ్ 2018లో ఎంవోయూ చేసుకుందని, ఈ ప్రాజెక్టు ద్వారా మూడు బెర్తుల నిర్మాణం పూర్తి చేశామన్నారు. వీటిలో ఒక బెర్త్‌ను బొగ్గు కోసం, రెండు బెర్తుల ద్వారా ఇతర అవసరాలు తీర్చుకుంటున్నారని తెలిపారు.

పోర్టు పనుల పూర్తికి చర్యలు

2022లో ఈ ప్రాజెక్టు ప్రారంభం కాగా ఇప్పటివరకు 16 మిలియన్ మెట్రిక్ టన్నుల ఎగుమతులు చేస్తున్నారన్నారు. 2026 నాటికి ఈ పోర్టు అభివృద్ధి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ పోర్టులో అరబిందో ఇన్‌ఫ్రా 74 శా తం వాటా, జీఎంఆర్ 26 శాతం వాటా ఉందని, ప్రభుత్వ రెవెన్యూ షేర్ వాటా 2.7 శాతమని తెలిపారు. ఈ మొత్తం ప్రాజెక్టు విలువ రూ.2, 621 కోట్లు అని, ఇప్పటికే 28 శాతం పనులు పూర్తి చేశారన్నారు. మిగిలిన పనులు 2026 నాటికి పూర్తి చేయాలని ఒప్పందం ఉందన్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టులో హ్యాండ్లింగ్ సామర్థ్యం 4 ఎంఎంటీగా ఉందని, గతేడాది 3.88 ఎం ఎంటీ బియ్యం ఎగుమతులు జరిగాయన్నారు. 2023-24 సంవత్సరానికి ఈ పోర్టు ద్వారా రూ. 61కోట్లు ఆదాయం వస్తే నేడు మరో రూ.7 కోట్లు పెరిగిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.68 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ సూచనల మేరకు రూ.1061 కోట్లతో గుంతల రహితంగా రహదారులను రాష్ట్రంలో తీర్చిదిద్దామన్నారు. మిగిలిన రోడ్లకు సంబంధించి పీపీపీ మోడల్ కింద అభివృద్ధి చేస్తామని తెలిపారు. మంత్రి పర్యటనలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మారిటైం బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య, చైర్మన్ దామచర్ల సత్య, మారిటైమ్‌బోర్డు సీఈ జీవీ రాఘవరావు పాల్గొన్నారు.

ఐదు నెలల్లో ఉప్పాడ హార్బర్ నిర్మాణం


ఉప్పాడ హార్బర్ డిజైన్‌ను పరిశీలిస్తున్న మంత్రి

కొత్తపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని ఐదు నెలల్లో పూర్తి చేసి చేసి మత్స్యకారులకు అంకితం చేస్తామని మంత్రి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పాడ- అమీనబాద్ మధ్యలో నిర్మాణంలో ఉన్న ఫిషింగ్ హార్బర్‌లో అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రికి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, కూటమి నేతలు ఘన స్వాగతం పలికారు. వేట నిషేధ సమయంలో మత్స్య కారులకు రూ.20 వేలు పరి హారం చెల్లిస్తామన్న ఎన్నికల హామీని ముఖ్య మంత్రి నెరవేర్చడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్, జనసేన వైద్య విభాగం ప్రతినిధి డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, టీడీపీ కొత్తపల్లి మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, దాసరి అర్జున్ ఉన్నారు.

తారస్థాయికి... కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ వివాదం

గుంపులుగా చేరి తోపులాటలు


కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద సభ్యుల మధ్య వాగ్వాదం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో తలెత్తిన వివాదం తారస్థాయికి చేరింది. దీంతో శనివారం లారీ యార్డుకు పెద్ద సంఖ్యలో సభ్యులు చేరుకుని వాగ్వివాదానికి దిగారు. గుంపులుగా చేరి తోపులాటలకు దిగడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజీనామా చేసి చాంబర్ నుంచి వెళ్లిపోవాలని నినాదాలతో హోరెత్తించారు. పెద్ద సంఖ్యలో సభ్యులు భైఠాయించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని గుంపులను చెదరగొట్టి చాంబర్‌లో ప్రెసిడెంట్‌కు భద్రత కల్పించారు. స్టీరింగ్ కమిటీ సభ్యులు నక్కా గీతాప్రసాద్, అడదాకుల రామకృష్ణయాదవ్, పైల శంకరరావు మీడియా తో మాట్లాడుతూ 6 దశాబ్దాల లారీ అసోసియే షన్ చరిత్రలో ప్రస్తుత కార్యవర్గం విధానాలతో పోర్టులో లారీలకు కిరాయి లేకుండా పోయిందన్నారు. ఈ కార్యవర్గం మీద విశ్వాసం లేదని మెజారిటీ సభ్యులు ముక్తకంఠంతో నినాదాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే కార్యవర్గంలోని ఇద్దరు వైస్ ప్రెసిడెంట్లు, సెక్రటరీ, ట్రెజరర్ రాజీనామా చేశారన్నారు. కార్యవర్గం లేకుండా అసోసియేషన్‌ను తానే నడుపుతానని ప్రెసిడెంట్ వాదించడం సరికాదన్నారు. దానిని సవరించు కుని సంఘ సభ్యుల ఆమోదంతో ప్రెసిడెంట్ అయితే తమకు అభ్యంతరం లేదన్నారు. 2014 నుంచి ఎమ్మెల్యేల సూచన మేరకు తమకు ఉపయోగపడే అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకుంటామన్నారు. అసోసియేషన్‌లో పరిస్థితులను ప్రస్తుత ఎమ్మెల్యేకు అనేక పర్యాయాలు చెప్పినా పట్టించుకోలేదని, తమను కాదనుకుంటు న్నారో ఏమిటో తెలియట్లేదన్నారు. వన్‌టౌన్, పోర్టు పోలీస్ స్టేషన్ సీఐలు తమ సిబ్బందితో వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు. దీంతో చాంబర్ నుంచి బయటకు వచ్చిన ప్రెసిడెంట్ దాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని, ఆయన చెప్పిన విధంగా నడుచుకుంటామని చెప్పి యార్డు నుంచి వెళ్లిపోయారు. పోలీసులు వెళ్లిన అనంతరం స్టీరింగ్ కమిటీ సభ్యులు లారీల కిరాయి సీరియల్ కొనసాగించారు.

ఉపాధి కూలీల ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

తొమ్మిదిమందికి గాయాలు


రాజమహేంద్రవరంలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తనయుడు సంజీవ్

కొత్తపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): శనివారం తెల్లవారుజామున ఉపాధి కూలీలతో వెళ్తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొనడంతో తొమ్మిది మంది గాయపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం చప్పిడివారిపాలానికి చెందిన గుబ్బల నాగలక్ష్మి, కుడుపూడి నాగమణి, ఇళ్ళ వెంకటలక్ష్మి, చప్పిడి గౌరి లక్ష్మి, పితాని సత్యవతి, చప్పిడి ధనమ్మ, మట్టపర్తి నాగలక్ష్మి, గుబ్బల లక్ష్మిలు ఉపాధి పని నిమిత్తం చప్పిడివారిపాలెం నుంచి అవిడి సత్తెమ్మ తల్లి ఆలయం వద్దకు ఆటోపై వెళ్తుండగా చప్పిడివారిపాలెం హైస్కూల్ మలుపు వద్దకు వచ్చేసరికి ట్రాక్టర్ ఢీకొంది. దీంతో ఐదుగురికి స్వల్పగాయాలు కాగా, నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్వలగాయాలైనవారిని అంబులెన్స్‌లో కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా తీవ్రంగా గాయపడిన నలుగురిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు సంజీవ్ రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. తక్షణం వైద్యాన్ని అందించాలని వైద్యాధికారులతో మాట్లాడారు. గుబ్బల నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు.

పశ్చిమగోనగూడెంలో మూడు పూరిళ్లు దగ్ధం


దగ్ధమైన ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం పశ్చిమగోనగూడెం శెట్టిబలిజపేటలో శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్ షాక్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. నాలుగు కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. విషయం తెలిసిన వెంటనే రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఓదార్చారు. టేకుమూడి మహాలక్ష్మి ఇంట్లో ముగ్గురు దివ్యాంగులు, ఒనుం నాగు, ఒనుం శ్రీనులు అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయారు. ఘటనాస్థలం పక్కనే అద్దెకు ఉంటున్నవారి ద్విచక్రవాహనం కూడా పూర్తిగా దగ్ధమైంది. రెండు అగ్నిమాపక వాహనాలు మంటలను అదుపుచేశాయి. స్థానికుల సాయంతో అతికష్టం మీదప్రాణాలతో బయటపడ్డారు. వారంతా కూలి పనే జీవనాధారం. బాధితులందరికీ ప్రభుత్వం తరుపున నష్టపరిహారాన్ని అందించే ఏర్పాటు చేస్తామని, ఇళ్లు నిర్మించడానికి లోన్లు ఇప్పిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. తక్షణ సహాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు చొప్పున రూ.40వేలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్ రొంగల దేవిక శ్రీనివాస్, కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మి సరోజ వీరగణేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తనకాల నాగేశ్వరరావు, జనసేన నాయకులు అడ్డాల శివ, బదిరెడ్డి దొర, మాజీ సర్పంచ్ కుంచు చల్లారావు, బొమ్ముల గంగరాజు, మేడిశెట్టి రాంబాబు అధికారులు ఉన్నారు. అలాగే జనసేన పార్టీ కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి బాధిత కుటుంబాలకు చీరలు, దుప్పట్లు అందజేశారు.

మాదక ద్రవ్యాలతో కుటుంబాలు నాశనం

సెంట్రల్ జైలు ఖైదీలకు 'ఈగల్' ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వాడకం వల్ల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతినడమే కాకుండా, కుటుంబాలు నాశనమవుతాయని అడిషనల్ ఎస్పీ (పరిపాలన) ఎన్‌బీఎం మురళీకృష్ణ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, ఎలైట్ యాంటీ నార్కొటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్) ఆధ్వర్యంలో నిషేధిత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, అలవాటును మానుకొనే పద్ధతులపై శనివారం ఖైదీలకు నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్నగా, స్నేహితుల ప్రోద్బలంతో మొదలు పెట్టి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారన్నారు. బతుకులను బుగ్గిపాలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సులభంగా డబ్బు సంపాదన కోసం చట్ట వ్యతిరేక మార్గాలను ఎంచుకుంటున్నారని, అలాంటి వాళ్లు ఏనాటికైనా శిక్ష అనుభవించకతప్పదని ఎన్నో ఘటనలు రుజువు చేశాయన్నారు. మాదక ద్రవ్యాల కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న వాళ్లు విడుదలై వెళ్లిన తర్వాత తాము అనుభవించిన కష్టాలను, కుటుంబంతో గడపకుండా కోల్పోయిన జీవితాన్ని సమాజానికి తెలియజేయాలన్నారు. మాదక ద్రవ్యాల వల్ల యువత నాశనం అవుతుందని జిల్లా ఎక్సైజ్ అధికారి లావణ్య అన్నారు. కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్.రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మనసు ఎప్పుడూ మన ఆధీనంలో ఉంటే చెడు వ్యసనాలకు దూరంగా ఉండొచ్చని జిల్లా అడిషనల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పీఎస్ రాహుల్ అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వాళ్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, డీఎడిక్షన్ సెంటర్ల ద్వారా ప్రభుత్వం అందించే ఉచిత వైద్యం పొంది కోలుకోవచ్చన్నారు. నిషేధిత మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల సూచనలతో విస్తృతంగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. తమ అనుభవాలను ఖైదీలు కొందరు స్వయంగా సదస్సులో వివరించారు. విడుదలైన తర్వాత వాటి జోలికి వెళ్లబోమని, అలవాటు ఉన్నవారిని మంచిగా మారే విధంగా చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.సుబ్బరాజు, డీఎస్.రత్నరాజు, జైలు ఉపాధ్యాయుడు చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ

వైభవంగా తలుపులమ్మ జాతర

» నమూనా ఆలయంలో పూజలు » సాంస్కృతిక కార్యక్రమాలు, కేరళ నృత్యాలు


ప్రత్యేక అలంకరణలో తలుపులమ్మ


జాతరలో కేరళ నృత్యాలను ప్రారంభిస్తున్న ఈవో

తుని రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానంలో గంధ అమావాస్యను పురస్కరించుకుని అమ్మవారి వార్షిక జాతర వైభవంగా జరిగింది. దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతర వేడుకల్లో శనివారం చివరిరోజున పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. లోవ దిగువున లోవ కొత్తూరు గ్రామంలో నిర్వహించే ఈ వేడుకను పురస్కరించుకుని నమూనా ఆలయంలో అమ్మవారికి ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కేరళ నృత్యాలను లోవ దేవస్థానం ఈవో విశ్వనాధరాజు ప్రారంభించారు. వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా రూరల్ సీఐ చెన్నకేశవ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం లోవ కొత్తూరు గ్రామంలో అమ్మవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఈవో తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని వివరించారు.

పాస్టర్ ప్రవీణ్ ఘటనపై మే 24న సభ

మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల సంఘటనపై వచ్చే నెల 24న తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కొంతమూరు సమీపంలోని ప్రకృతి వనం వద్ద మైదానంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తెలిపారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో శనివారం విలేకర్లతో మాట్లాడారు. తాను మొదట్నుంచి పాస్టర్ ప్రవీణ్ పగడాలది ప్రమాదం కాదు హత్య అని చెబుతున్నానన్నారు. హైకోర్టులో తాను పిల్ వేశానన్నారు. ఈ సభకు కేఏ పాల్, పాస్టర్ ప్రవీణ్ పగడాలకుటుంబీకులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

అంతర్వేది, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం మోరి గ్రామంలో శుక్రవారం రాత్రి పోతురాజు లక్ష్మీనరసింహారావు (చిన్నా) (43) విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అయ్యప్పస్వామి మాలధారణలో ఉన్న లక్ష్మీనరసింహారావు తన స్వగృహంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో పరిశీలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె. దుర్గాశ్రీనివాస్ తెలిపారు.

దిండిలో...

మలికిపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం దిండిలో రొయ్యల చెరువు వద్ద విద్యుత్ షాక్‌తో రామరాజులంకకు చెందిన పున్నం నాగమావుళ్లు (32) శుక్రవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు.

'ఆత్మహత్య చేసుకుంటాం'


మాట్లాడుతున్న బాలమ్మ దంపతులు

దేవీపట్నం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్యాకేజీ ఇప్పించకపోతే రంపచోడవరం అంబేడ్కర్ సెంటర్‌లో ఈనెల 28న ఎండ్రిన్ తాగి చనిపోతామని దేవీపట్నం మండలం ఏనుగులగూడెం గ్రామానికి చెందిన సుండం బాలమ్మ, ఆమె భర్త అబ్బాయిదొర పేర్కొన్నారు. శనివారం బాలమ్మ మీడియాతో మాట్లాడుతూ పోలవరం ప్యాకేజీ కోసం ఏడేళ్లుగా దేవీపట్నం తహశీల్దార్ కార్యాలయం, ఐటీడీఏ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఈనెల 21న స్పందనలో సబ్ కలెక్టర్ కల్పశ్రీని కలవగా పెళ్లి అయిన కారణంగా ప్యాకేజీ రాదని, మూగదానివి అయితే నాకేంటి ఇది గవర్నమెంట్ జీవో నువ్వు ఏం చేసుకుంటావో చేసుకోమని తనను తక్కువ చేసి మాట్లాడారని ఆరోపించింది. సబ్ కలెక్టర్ మాటలకు బాధ కలిగి తాము చనిపోవడానికి సిద్ధపడ్డామని, మా చావుకి కారణం రంపచోడవరం సబ్ కలెక్టర్, రెవెన్యూ అధికారులేనని ఆదంపతులు తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల విజేత 'విశాఖ'



ఫైనల్‌లో తలపడుతున్న విశాఖ, కడప జట్లు


విజేత జట్టుకు ట్రోఫీని అందిస్తున్న దృశ్యం

తొండంగి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం యల్లయ్యపేటలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో విశాఖపట్నం జట్టు విజేతగా నిలిచింది. గ్రామంలో కాశిదేవమ్మ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా మెరైన్ రాకెట్స్ యూత్ ఆధ్వర్యంలో ఇన్విటేషన్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ నెల 24 నుంచి జరిగిన పోటీల్లో 11 జట్లు పాల్గొన్నాయి. శనివారం తుదిపోరులో విశాఖపట్నం, కడప జట్లు తలపడగా విశాఖ విజేతగా నిలిచింది. కడప జట్టు రన్నర్‌తో సరిపెట్టుకోవలసి వచ్చింది. విజేత జట్టుకు కోడ వెంకటరమణ, కోడా అప్పలరాజు, చొక్కా రాజు సంయుక్తంగా ప్రకటించిన రూ.30వేల నగదుతో పాటు ట్రోఫీని అందించారు. రన్నర్‌కు రూ.20వేల నగదుతో పాటు ట్రోఫీని బహూకరించారు. టీడీపీ జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు కోడ వెంకటరమణ గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బహుమతులు అందించారు. కాశిదేవమ్మ ఆలయ కమిటీ, యూత్ సభ్యులు పాల్గొన్నారు.


సత్యసాయి గురుకుల పాఠశాలకు విజనరీ స్కూల్ ఆఫ్ ది ఇయర్ అవార్డు

రాజమహేంద్రవరం, ఏ ప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉచిత విద్య, మానవతా విలువలకు ప్రాధాన్యమిస్తూ ఎన్నో ఏళ్లుగా ఉత్తమ ఫలితాలను సాధిస్తున్న తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని శ్రీ సత్యసాయి గురుకుల పాఠశాల మోస్ట్ ప్రామిసింగ్ అండ్ విజనరీ స్కూల్ ఆఫ్ ది ఇయర్-2025 అవార్డు సాధించిందని కరెస్పాండెంట్ అయోధ్యుల శ్యామసుందర్, ప్రిన్సిపాల్ కె.గురయ్య శనివారం తెలిపారు. బెంగళూరులో ఈ నెల 25న అవార్డును స్కూల్ తరఫున తాను అందుకున్నానని గురయ్య పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషితో సాధించిన ఉత్తమ ఫలితాలు ఇలాంటి ఉన్నతమైన అవార్డులను తీసుకురావడంలో దోహద పడుతున్నాయని, ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తామని తెలిపారు.


అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ గురయ్య

దొంతికుర్రు మహిళకు 'గిన్నిస్' ధ్రువపత్రం

కాట్రేనికోన, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం దొంతికుర్రుకు చెందిన సంసాని దివ్యస్వరూప కీబోర్డు ప్రదర్శనలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుంచి ధ్రువపత్రం అందుకున్నారు. విజయవాడ హలేల్ సంగీత పాఠశాల ఆధ్వర్యంలో గతేడాది ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన ప్రపంచ స్థాయి కీబోర్డు సంగీత ప్రదర్శనలో దివ్యస్వరూప పాల్గొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 18 దేశాలకు చెందిన 1046మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి గిన్నిస్ బుక్‌లో చోటు దక్కడంతో పాల్గొన్న వారందరికీ ధ్రువపత్రాలు లభించాయి. సంగీత పాఠశాల ప్రతినిధులు దివ్యస్వరూపకు ధ్రువీకరణపత్రం అందించారు.



ధ్రువపత్రం అందుకుంటున్న దివ్యస్వరూప

వేములమ్మకు బోనాలు



రౌతులపూడి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గంధామావాస్య పండుగను పురస్కరించుకుని కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం బీబీ పట్నంలో గ్రామదేవత అయిన వేములమ్మవారికి శనివారం సాయంత్రం మహిళలు బోనాలు సమర్పించారు.

మోటారు సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి

రాయవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నడిచి వెళ్తున్న వ్యక్తిని మోటారు సైకిలిస్టు ఢీకొనడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి అనపర్తి మండలం పులుగుర్త గ్రామానికి చెందిన పల్లెటి రాజు(50) మాచవరం సెంటర్ నుంచి పులుగుర్త వైపునకు నడిచి వెళ్తుండగా మోటారు సైకిలిస్టు వెనుక నుంచి ఢీకొనడంతో రాజు తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న రాయవరం ఎస్ఐ క్షతగాత్రుడిని 108లో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. మృతుడు సోదరుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు.

గుబ్బాలమ్మకు 8 కిలోల వెండి కిరీటం

కిర్లంపూడి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త సంపర సుధాకర్ గుబ్బాలమ్మ తల్లికి జాతర సందర్భంగా రూ.10లక్షలు విలువైన 8 కిలోల వెండి కిరీటం చక్రాన్ని బహూకరించారు. వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి కిరీటాన్ని అమర్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల వెంకటేష్, గుడాల రాంబాబు, గ్రామపెద్దలు ఉన్నారు.



ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

చాగల్లులో వాహన తనిఖీలు

చాగల్లు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో అనుమానాస్పద వ్యక్తుల సమాచారం కోసం స్థానిక సెంటర్‌లో ఎస్‌ఐ కే.నరేంద్ర ఆధ్వర్యంలో శనివారం వాహన తనిఖీలు చేశారు. సుమా రు వందకు పైగా వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితులు కనిపిస్తే ఫోన్ చేయాలని సూచించారు.



అనపర్తి సచివాలయం-4లో తనిఖీలు నిర్వహించి సిబ్బందిని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

పారిశుధ్య నిర్వహణలో

అలసత్వం వహిస్తే సహించేది లేదు

● అనపర్తిలో పంచాయతీ, సచివాలయాల్లో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

అనపర్తి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేదిలేదని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం అనపర్తి మండలంలోని పొలమూరు సచివాలయం, అనపర్తిలోని గ్రామ పంచాయతీ, 4వ సచివాలయాల్లో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పొలమూరు సచివాలయంలో నెలరోజులుగా హాజరుపట్టీలో సంతకాలు లేకపోవడం గుర్తించిన ఎమ్మెల్యే సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులపై ఆరా తీశారు. అనంతరం అనపర్తి పంచాయతీ కార్యాలయానికి చేరుకున్న ఆయన పంచాయతీ పారిశుధ్య పనులపై ఆరా తీశారు. పంచాయతీకి చెందిన ఉద్యోగి సత్యనారాయణ ఈనెల 27 నుంచి సెలవు పెట్టుకున్నారని అయితే శనివారం ఆయన కార్యాలయానికి రాకుండానే ముందు రోజునే హాజరుపట్టీలో సంతకం చేయడం గుర్తించిన ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఇటువంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం సచివాలయం 4కు చేరుకున్న ఎమ్మెల్యే కార్యాలయంలో పేరుకుపోయిన దుమ్మును పరిశీలిస్తూ ప్రజలకు స్వచ్ఛ భారత్ గురించి చెప్పడమే కాకుండా కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం సూపర్‌వైజర్లతో వీడియో కాల్ మాట్లాడి పారిశుధ్య పనుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో నాలు గు మండలాల్లోని ప్రతి పంచాయతీలోను జరుగుతున్న పనులను సమీక్షిస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

మహిళలకు స్వయం ఉపాధికి కుట్టు శిక్షణ

● కుట్టుశిక్షణ కేంద్రం ప్రారంభంలో ఎమ్మెల్యే గోరంట్ల



కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

కడియం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మహిళల సంరక్షణ ధ్యేయంగా వారికి ఉపాధికల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని రూరల్‌ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. శనివారం కడియం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్‌తో కలిసి కుట్టుశిక్షణ కేంద్రాన్ని గోరంట్ల ప్రారంభించారు. ఈసందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ మహిళలందరికీ వృత్తినైపుణ్యంలో శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి మెరుగుపరచడంలో భాగంగా వ్యాప్తవ్యాప్తంగా ఈరోజు ప్రతీమండలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. కడియం మండలంలో 249 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని వారికి 90 రోజుల పాటు శిక్షణ ఇచ్చి శిక్షణ అనంతరం కుట్టుమిషన్ కూడా ఉచితంగా అందించామని చెప్పారు. ముఖ్యమంత్రిచంద్రబాబు మహిళా పక్షపాతిగా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి రఘురాం, వైస్ ఎంపీపీ పంతం గణపతి, మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి, బోడపాటి గోపి, ముద్రగడ జమ్మి, ప్రత్తిపాటి రామారావుచౌదరి, చెల్లుబోయిన శ్రీనివాస్, పాతంశెట్టి రాంజీ, చెక్కపల్లి మురళీకృష్ణ, ఏపిఎం నాగలక్ష్మి, బొరుసు సుబ్రహ్మణ్యం, కలిదిండి గోవిందు, ఆదిమూలం సాయిబాబా, వాసంశెట్టి నాగబాబు, సురపురెడ్డి జానకిరామయ్య, జల్లి కృపారావు, గుత్తుల కృష్ణ పాల్గొన్నారు.

'ప్రతిఇంటికీ గోదావరి నీరు అందిస్తాం

రాజమహేంద్రవరంరూరల్ నియోజకవర్గంలో ప్రతి ఇంటికి గోదావరి నీరును అందించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యేగోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. శనివారం కడియం మండలం జేగురుపాడు ఎస్సీకాలనీలో రూ49.10 లక్షలతో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న వాటర్ ట్యాంక్‌ను, కడియం దోసాలమ్మకాలనీలో రూ47.10లక్షలతో నూతనంగా నిర్మించిన వాటర్‌ట్యాంక్‌ను ప్రారంభోత్సవం, దుళ్ళగ్రామం ఎర్రకాలనీలో రూ49.90 లక్షలతో నూతనంగా నిర్మించే వాటర్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, గట్టి సుబ్బారావు, నాగిరెడ్డి, పాతూరి రాజేష్, మర్రెడ్డి రమేష్ పాల్గొన్నారు.

దివాన్‌చెరువు ఫ్లైఓవర్‌కు

ఎన్టీఆర్ పేరు పెట్టాలి

దివాన్‌చెరువు, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై దివాన్‌చెరువులో నిర్మించనున్న ఫ్లైఓవర్ నిర్మాణానికి దివంగత ముఖ్యమంత్రి ఎన్టీరామారావు పేరు నామకరణం చేయాలని దివాన్‌చెరువుకు చెందిన సామాజిక కార్యకర్త సూరారపు డేవిడ్ రాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో చాగల్నాడు ప్రాంతంగా పిలవబడే ఈప్రాంతమంటే ఎన్టీఆర్‌కు ఎంతో ఇష్టమని చెప్పారు. అలాగే ఈప్రాంతంలో ఎన్టీఆర్ అభిమానులు కూడా అధికమేనని అన్నారు. రూ326 కోట్లతో దివాన్‌చెరువులోని పండ్ల మార్కెట్ వద్ద నుంచి దాదాపు 2.5 కి.మీ మేర నిర్మిస్తున్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ కోరారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదలచేస్తూ అనేక పోరాటాలు చేసి సాధించుకున్న డీఎస్సీ నోటిఫికేషన్‌లో అనేక లోపాలు ఉన్నాయని, వాటిని తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను డీఎస్సీకి అనర్హులుగా చేసే నిబంధనలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

పహల్గాం ఉగ్రదాడి దారుణం

● ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఖండన

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) :కశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు 27 మంది పర్యాటకులను దారుణంగా హతమార్చిన సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాజమహేంద్రవరం నగరశాఖ పేర్కొంది. ఈమేరకు శనివారం రాజమహేంద్రవరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలో నగరశాఖ అధ్యక్షుడు జీబీ విజయకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్‌వర్మ మాట్లాడుతూ ఇటువంటి ఉగ్రవాద చర్యలు ప్రపంచశాంతికి తీవ్ర విఘాతం కలిగిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. నగరశాఖ సహ అధ్యక్షుడు కె.నాగసాయి, సంయుక్త కార్యదర్శి కిరణ్మయి, ఉపాధ్యక్షుడు బి.అప్పారావు, మహ్మద్ జమీర్, స్వర్ణ శారదాదేవి, భద్ర, మజ్జి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యాటకులపై దాడి హేయమైన చర్య

ధవళేశ్వరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలోని పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి అబ్దుల్ రెహమాన్ ఖాన్ ఒక ప్రకటనలో ఖండించారు. పర్యాటకుల మతాన్ని అడుగుతూ కాల్పులు జరపడాన్ని హేయమైన చర్యగా అభివర్ణించారు.

● పర్యాటకుపై ఉగ్రదాడిని యావత్తు ప్రపంచం ముక్తకంఠంతో ఖండించాలని సుబ్బరాజు ఫౌండేషన్ వ్యవస్థాపకులు గాలి సుబ్బరాజు పిలుపునిచ్చారు. శనివారం ఆల్‌నైట్ ప్రేయర్ టీం పాస్టర్లతో కలిసి దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

బాలిక అదృశ్యం

చాగల్లు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలటూరుకు చెందిన కేశవరపు శ్రావణి (17) ఇంట్లో ఎవరికీ చెప్పకుండా శుక్రవారం బయటకు వెళ్లిపోయింది. దీంతో కంగారుపడ్డ ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనికి సంబంధించి ఎస్‌ఐ కే.నరేంద్ర వివరాలు వెల్లడిస్తూ.. శ్రావణి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో అన్నిచోట్లా వెతికినా ఆచూకీ లభించకపోవడం వల్ల ఆమె తల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కొత్త పింఛన్లకు గ్రీన్ సిగ్నల్

● ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



గ్యాస్ డెలివరీ వర్కర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొత్త పెన్షన్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 25నుంచే స్పౌజ్ పింఛన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు నిర్ణయం చారిత్రాత్మకం అన్నారు. స్పౌజ్ పింఛన్ల కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తుల నమోదు అవకాశం కల్పించారని తెలిపారు. ఈనెల 3లోగా సంబంధిత పత్రాలు సమర్పిస్తే మే1 నుంచే పింఛన్లు జారీ చేయనున్నారని తెలిపారు. తమ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని వితంతువులకు చేదోడుగా ఉం దన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద కొత్తగా 89,788మందికి పింఛన్లు అందించనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పెన్షన్ పొందుతున్న భర్త దురదృష్టవశాత్తు మరణిస్తే భార్యకు మరుసటి నెల నుంచే పించను అందించేలా స్పౌజ్‌కేటగిరి గతేడాది నవంబరు నుంచి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు.

దీపం సిలిండర్లకు డెలివరీ చార్జీలు తీసుకోవద్దు

కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దీపం పథకంలో ఇళ్ళకు గ్యాస్‌సిలెండర్ చేరవేస్తున్నపుడు డెలివరీ చార్జీలు తీసుకోవద్దని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు సూ చించారు. తిలక్‌రోడ్డులోని తన కార్యాలయంలో శనివారం గ్యాస్ డెలివరీ కార్మికులతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ దీపం పథకం పొందిన వారి నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం సమాచారం సేకరించిందని ఆ సమయంలో దీపం లబ్దిదారులు గ్యాస్ డెలివరీ బాయ్స్ డెలివరీ చార్జీలు తీసుకుంటున్నట్లు ఫీడ్ బ్యాక్ ఇచ్చారని ఈ సమాచారం తనకు ఇబ్బంది కలిగించిందన్నారు. గ్యాస్ డెలివరీ కార్మికుల సమస్యలు తనకు తెలుసునని కష్టానికి తగిన ప్రతిఫలం ఆశించడంలో తప్పులేదని, కానీ దీపం పథకం సిలిండర్లకు ఉచితంగా డెలివరీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నాయకులు మరుకుర్తి రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు అన్-ఎయిడెడ్ పాఠశాలల్లో చేరేందుకు

ఆన్‌లైన్ దరఖాస్తులకు ఆహ్వానం

రాజానగరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి వెనుకబడిన వర్గాలు, షెడ్యూల్ తెగ వర్గాలకు చెం దిన పిల్లలకు తరగతి-1లో ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25శాతం సీట్లను కేటాయిస్తామని, ఆసక్తి కలిగిన వారి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారులు రామన్నదొర, జ్యోతి ప్రసాద్‌లు శనివారం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలు, షెడ్యూల్ తెగ వర్గాలకు చెందిన పిల్లలకు అనాథ, హెచ్‌ఐవీ బాధిత, వికలాంగులు,బలహీనవర్గాలు, షెడ్యూలు కులం, అనాథ, హెచ్‌ఐవీ బాధితు లు, వికలాంగులకు 5శాతం, షెడ్యూల్ కులాల వారికి 10శాతం, షెడ్యూల్ తెగలవారికి 4శాతం, బలహీనవర్గాలు, ఇతరులు అనగా(బీసీ మైనార్టీలు, ఓసీ)లు పల్లె ప్రాంతంలో నివసిం చే వారికి వార్షిక ఆదాయం ఏడాదికి రూ.1.20లక్షలు మించనివారు, ప్రాంతంలో ఏడా దికి రూ.1.44లక్షలు మించని వారికి 6శాతం వెరసి మొత్తం 25శాతంసీట్లు భర్తీ చేస్తామ న్నారు. ఈనెల 28నుంచి మే15వ వరకుఆన్ లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చని చెప్పారు.

విద్యార్థి మిత్రలో మెటీరియల్ విడుదల

సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్రలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి రానున్న విద్యాసంవత్సరానికి సంబంధించి మొదటి విడతగా పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, బెల్టు, బ్యాగు, షూ తదితర సామగ్రి మండల విద్యాశాఖకు చేరినట్లు ఎంఈవోలు రామన్నదొర, జ్యోతిప్రసాద్‌లు తెలి పారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి 28,227 పాఠ్యపుస్తకాలకుగాను, 20,045 పుస్తకాలు వచ్చాయని, మిగిలినవి రెండోవిడతలో పుస్తకాలతోపాటు ఇతర కిట్లు వస్తాయన్నారు. విద్యా సంవత్సరం మొదటిరోజున ప్రతి విద్యార్థికి సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర అందిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభిస్తామని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు.

రంగంపేట: విద్యాహక్కుచట్టం-2009 సెక్షన్ (1)(సి) ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో ఉచిత అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని రంగంపేట మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని వారి నివాస ప్రాంతంలో సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ/ఐబీ/స్టేట్ సిలబస్‌ను అనుసరిస్తున్న అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో 25శాతం సీట్లు కూటమి ప్రభుత్వం కేటాయించిందన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే భరత్‌రామ్ విమర్శలు

● విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ఎంపీ పురంధేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సమష్టిగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారని, దీన్ని చూసి ఓర్వలేకనే మాజీ ఎంపీ భరత్‌రామ్ విమర్శలు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రి అధికారులు అడగకపోయినా ప్రజల కోసం రూ.2 కోట్ల విలువైన జనరేటర్, అధునాతనమైన అంబులెన్స్, ఇన్వర్టర్లు, ఇతర పరికరాలను ఎంపీ పురంధేశ్వరి సమకూర్చుతున్నారని అన్నారు. రాజమహేంద్రవరం మెడికల్ కాలేజీ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మంజూరు చేస్తే మాజీ ఎంపీ మాత్రం తానే తెచ్చానని గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదమని అన్నారు. గత పార్లమెంట్ సభ్యుడిగా భరత్‌రామ్ నియోజకవర్గ అభివృద్ధిని గాలికొదిలేశారని విమర్శించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

29న పరశురామ్ పురస్కారాలు

రాజమహేంద్రవరం కల్చరల్,ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణులకు ఈనెల 29న లలితానగర్‌లోని భార్గవ కల్యాణ మండపంలో పరశురామ్ పురస్కారాలను అందజేస్తున్నట్లు పురస్కారాల కమిటీ ఛైర్మన్ దూర్వాసుల సత్యనారాయణ తెలిపారు. వివిధ రంగాల్లో బ్రాహ్మణులకు విశేషసేవలు అందించిన రాజమండ్రికి చెందిన జమ్మి రామారావు, మంచిరాజు హేమలత,నండూరి సుబ్బారావు, కోరుకొండకు చెందిన కొత్తపల్లి భాస్కర్ రామారావు, రాజానగరంనకు చెందిన వాడ్రేవు శ్రీనివాస్ కుమార్, కొవ్వూరుకు చెందిన పిల్లలమర్రి మురళీకృష్ణ, ఉండ్రాజవరానికి చెందిన జోస్యుల సుబ్రహ్మణ్యంపురస్కారాలను అందుకుంటారన్నారు.

గైట్ ప్రాంగణంలో పాలిసెట్‌కు రెండు పరీక్షా కేంద్రాలు

● ఈ నెల 30న పాలిసెట్ పరీక్ష

రాజానగరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రభుత్వం నిర్వహించే ఏపీ పాలిసెట్ 2025 ప్రవేశ పరీక్షకు గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయు)ప్రాంగణంలో రెండు పరీక్షా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు గైట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.జి.రామానుజం, వైస్ ప్రిన్సిపాల్ టి.రామారావు తెలిపారు. ఈసందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ గైట్ పాలిటెక్నిక్ కళాశాల పరీక్షా కేంద్రంలో 855మంది విద్యార్థులు, ఆర్‌కె బ్లాక్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 936 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారన్నారు. మొత్తం రెండు పరీక్షా కేంద్రాల్లో 1791 మంది విద్యార్థులు పాలిసెట్ పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈనెల 30న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటు ంది. విద్యార్థులు హాల్‌టిక్కెట్, ఫొటో ఐడీ పత్రం విధిగా తీసుకురావాలన్నారు. పరీక్ష రోజున ఉదయం 9 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ సభ్యురాలు అమర్‌జహాబేగ్

ఇంటెలిజెన్స్ భద్రతా దళాల వైఫల్యంతోనే

దేశంలోకి ఉగ్రవాదుల చొరబాటు

● ఏఐసీసీ సభ్యురాలు అమర్‌జహాబేగ్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఇంటెలిజెన్స్ భద్రతా దళాల వైఫల్యం వల్లనే దేశంలోకి ఉగ్రవాదులు చొరబడ్డారని ఏఐసీసీ సభ్యురాలు అమర్‌జహాబేగ్ ఆరోపించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో అమర్‌జహాబేగ్ మాట్లాడుతూ పహల్గామ్‌లోకి ఉగ్రవాదులు చొరబడి 26 మందిని నిర్దాక్షిణ్యంగా కాల్చిచంపారని దీనికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని పీసీసీ అధ్యక్షురాలు షర్మిళారెడ్డి అంటే దానిపై బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మలా కిషోర్ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. షర్మిళారెడ్డి పార్టీలు మారి వచ్చారని ప్రశ్నిస్తున్న వారికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఎక్కడి నుంచి వచ్చారో గుర్తులేదా అని ప్రశ్నించారు. 10ఏళ్ళు కేంద్ర మంత్రిగా పనిచేసింది ఏ పార్టీలోనో తెలియదా అని అన్నారు. మోదీ దేశానికి ప్రధానిగా ఉన్నారని ఏ సంఘటన జరిగినా ప్రశ్నించే హక్కు ప్రతీ భారతీయ పౌరుడికి ఉంటుందని ప్రతిపక్షం ప్రశ్నించకూడదంటే ఎలాగని నిలదీశారు. హత్రాస్, హథువా, మణి పూర్‌లలో దారుణమైన హింస చెలరేగినప్పుడు ఈ బీజేపీ మహిళామోర్చా నాయకులు ఏమైపోయారని ప్రశ్నించారు. పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిన దేశం యావత్తు ఖండిస్తోందని కేంద్రప్రభుత్వానికి అండగా నిలబడ్డారని గ్రహించాలని అన్నారు. పహల్గాం లో జరిగిన దాడికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ, అమిత్‌షాలు దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోతా శారద, నాయకులు షేక్ లలిత, లీలాచౌదరి, మండూరి ఎస్తేరు,కమలకుమారి, చౌటుపల్లిజ్యోతి పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం



కొత్తపల్లిలో అగ్నిప్రమాదానికి గురైన తాటాకిల్లు

గోకవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన వందనాసి ధర్మరాజుకు చెందిన తాటాకిల్లు ఈ ప్రమాదానికి గురైంది. ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తూ ఈసంఘటన చోటుచేసుకున్నట్లు బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని స్థానికుల అంచనా. కూలిపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న ధర్మరాజు కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

15 లీటర్ల నాటు సారా స్వాధీనం

రంగంపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోగల రంగంపేట మండలం వడిశలేరులో శనివారం దాడులు నిర్వహించి అదే గ్రామానికి చెందిన కురుకూరి దుర్గ అనే మహిళను అరెస్ట్‌చేసి ఆమె వద్ద నుంచి 15లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీ.ఐ.సుధ తెలిపారు. దాడులలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారన్నారు.



వైద్యుడు ప్రదీప్‌ను సత్కరించిన వైద్యులు, సిబ్బంది

వైద్యుడు ప్రదీప్ సేవలు మరువలేనివి

గోకవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభు త్వాసుపత్రికి వచ్చిన రోగులకు ఎంతో ప్రేమ, ఆప్యాయ తతో సేవలందించిన ఆర్థోపెడిక్ వైద్యుడు ప్రదీప్ సుందర్ సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. సుమారు ఏడు సంవత్సరాలపాటు ఆసుపత్రిలో వైద్య సేవలందించి బదిలీపై వెళ్లి ఇటీవల పదోన్నతి పొందిన వైద్యుడు ప్రదీప్ సుందర్‌ను శనివారం ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ సభ్యులు పెనుగొండ సత్యానందం పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సత్కారం

బిక్కవోలు, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు ఉన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతిలో అత్యుతమ మార్కు లు సాధించిన విద్యార్థులను శనివారం ఎస్ఎంసీ సభ్యు లు, కూటమి నేతలు అభినందించి సత్కరించారు. ఈసం దర్భంగా స్కూల్ టాపర్‌గా నిలిచిన దాసరి జయమంగమణితోపాటు 500 మార్కులకుపైగా సాధించిన వినయ్, లావణ్య, శృతి, శివాని, ఎస్.లావణ్యలను అభినందించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు పల్లి శ్రీనివాసరెడ్డి, గొర్రెల త్రిమూర్తులు, సిం గారపు రామారావు, వానపల్లి శ్రీను, వైబాగుల సూర్యచంద్రరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ వీరలక్ష్మి, హెచ్ఎం ప్రభాకరరావు పాల్గొన్నారు.



పదిలో స్కూల్ టాపర్ జయమంగమణిని అభినందిస్తున్న కూటమి నేతలు



బిక్కవోలులో సబ్సిడీ రుణాలకు వచ్చిన వారి దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

90 సబ్సిడీ రుణాలకు.. 338 మంది హాజరు

బిక్కవోలు,ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో కాపు, బీసీ, ఈడబ్ల్యుఎస్ కార్పొరేషన్ల సబ్సిడీ రుణాలకు 595 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 338 మంది శనివారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరయ్యారని ఎంపీడీవో వి.శ్రీనివాస్ తెలిపారు. వీరిలో 90 మందిని ఎంపికచేసి 2కోట్ల7లక్షల రుణాలు అందజేస్తారు. ముందుగా అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి ఆయా గ్రామాలకు సంబంధించిన బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు చేశారన్నారు. డిప్యూటీ ఎంపీడీవో జాన్ మిల్టన్, ఏవో రత్నకుమార్ పాల్గొన్నారు.

అధికారుల వాహన తనిఖీలు

గోపాలపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అక్రమ రవాణా సహించేది లేదని దేవరపల్లి సీఐ నాగేశ్వర్ నాయక్ వాహనదారులను హెచ్చరించారు.రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు జాతీయ రహదారి 516డీ కరిచర్ల గూడెం జంక్షన్ వద్ద నిర్వహించిన వాహనాలు తనిఖీ చేశారు. శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏకకాలంలో తనిఖీలు చేశామన్నారు. కరిచర్లగూడెం జంక్షన్ వద్ద 223 వాహనాలను తనిఖీ చేసినట్టు చెప్పారు. వీరిలో ముగ్గురు డ్రైవర్లు, మద్యం సేవించినట్టు నిర్ధారించామన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: జింఖానా
సూర్యమినీ	: కేసరి చాప్టర్-2
సూర్యప్యాలస్	: జాక్
స్వామి	: ఓదెల-2
శివజ్యోతి	: అర్జున్ s/o వైజయంతి
అనుశ్రీ(సాయికృష్ణ)	: తుడరుమ్
రాజా	: ఓదెల-2
ఊర్వశి	: చౌర్యపాఠం
రంభ	: అన్టిల్ డాన్
మేనక	: సూర్యపేట్ జంక్షన్, సోదరా
అప్సర	: సారంగపాణి జాతకం
కుమారి	: ఓదెల-2
అశోక	: అర్జున్ s/o వైజయంతి
వీఎస్ మహల్(నామవరం)	: తుడరుమ్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: సారంగపాణి జాతకం
వెంకటసూర్య(కడియం)	: అర్జున్ s/o వైజయంతి
సత్యగౌరి (అనపర్తి)	: ఓదెల -2
సూర్యశ్రీ (అనపర్తి)	: అర్జున్ s/o వైజయంతి
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: సారంగపాణి జాతకం
గీతాసినిమాస్(సీతానగరం)	: సోదరా
శ్రీనివాస (గోకవరం)	: అర్జున్ s/o వైజయంతి
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: జింఖానా
లలితామహల్(రంపచోడవరం)	: అర్జున్ s/o వైజయంతి
నవయుగ(చింతూరు)	: అర్జున్ s/o వైజయంతి

రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0 (శనివారం)
కనిష్ఠం : 25.0

నేటి నుంచి కాలువల మూసివేత 7

ఆదివారం ప్రత్యేకం

నోరూరే.. ఊరుగాయ!





గ్రామంలో కుటుంబాలు : 1156 - పచ్చళ్ల తయారీ కుటుంబాలు : 800



పచ్చళ్ల పల్లెటూరు నార్కెడిమిల్లి











గోదారోళ్ల పచ్చళ్లు అంటే నోరూరాల్సిందే.. ఆ టేస్టే వేరు.. ఆ టేస్టే వేరు.. ఒకసారి తిన్నారా.. వదిలిపెట్టరు.. మళ్లీ మళ్లీ నోరూరిస్తోంది.. చూసిన వెంటనే లొట్టలేస్తారు.. అందుకే 60 ఏళ్లు అవుతున్నా ఆ ఊరి పచ్చడికి నేటికీ డిమాండ్ తగ్గలేదు.. ఎన్ని కంపెనీలు వచ్చినా ఆ ఊరు ఊరగాయకు ఏ మాత్రం డిమాండ్ తగ్గలేదు.. అంతకంతకూ పెరుగుతూనే ఉంది.. ఇంటికో పచ్చళ్ల పరిశ్రమ ఉంటుందంటే అతిశయోక్తి కాదేమో.. ఊళ్లో 1156 కుటుంబాలు ఉంటే 800 కుటుంబాలకు అదే ఆధారం. ఒకసారి పచ్చళ్ల పల్లెటూరు నార్కెడిమిల్లిని చూసొద్దామా..

- ఆత్రేయపురం -ఆంధ్రజ్యోతి

ఎక్కడో మారుమూల పల్లెటూరు.. పరిసర గ్రామాల ప్రజలకు పేరు చెప్పినా అదెక్కడ అంటూ ఆలోచిస్తారు.. అయితే దేశవిదేశాల్లో మాత్రం చాలా పెద్ద ఫేమస్.. ఎందుకంటే ఆ ఊరు పచ్చళ్లకు అంత డిమాండ్.. పూతరేకులకు ఆత్రేయపురం ఫేమస్ అయితే ఊరగాయలకు నార్కెడిమిల్లి ఫేమస్.. ఆ గ్రామంలో అడుగు పెట్టగానే ఏ ఇంట చూసిన పచ్చళ్ల డ్రమ్ములు.. బస్తాల్లో ముడి సరుకు.. నోరూరించే పచ్చళ్ల సువాసనలు వెదజల్లుతుంటాయి. వశిష్ఠ గోదావరి చెంతనే ఉన్న గ్రామం పచ్చళ్లకు ఎంతో ప్రసిద్ధిగాంచింది. సుమారు ఆరు దశాబ్దాల కిందట నుంచే ఇక్కడ పచ్చళ్లు తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఇళ్ల వద్దే కుటీర పరిశ్రమగా స్థాపించి అన్ని రకాల పచ్చళ్లు సీజన్ వారీగా నిత్యం తయారుచేస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. ఇక్కడ తయారైన పచ్చళ్లు దేశంలో వివిధ ప్రాంతాలకు తీసుకుని వెళ్లి విక్రస్తుంటారు.

60 ఏళ్లుగా అదే వ్యాపారం..

ఆరు దశాబ్దాల కిందట పచ్చళ్ల తయారీ వెలసింది. నాడు సరదాగా ప్రారంభించిన పచ్చళ్ల వ్యాపారం నేడు ప్రతి ఇంటికీ ఉపాధిగా మారింది. ఆ ఊరులో ఏ ఇంటి ఎదుట చూసినా పచ్చళ్ల డ్రమ్ములు కనిపిస్తూనే ఉంటాయి. పచ్చళ్లలో ఎటువంటి రంగులు, రసాయనాలు లేకుండా తయారుచేయడం ప్రత్యేకత. కారం, ఉప్పు, ఇతర సామగ్రి హోల్‌సేల్‌గా కొనుగోలు చేసుకుని ఎండబెట్టి శుభ్రం చేసి ఎంతో శ్రద్ధగా నాణ్యత ప్రమాణాలతో పచ్చళ్లను తయారు చేస్తారు. అందుకే 60 ఏళ్లయినా నేటికీ నోరూరుతూనే ఉన్నాయి ఆ ఊరి పచ్చళ్లు.. తయారు చేసిన పచ్చళ్లను డ్రమ్ముల్లో నిల్వ చేసి వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. అక్కడ వ్యాపారులు సైకిళ్లు, బైక్‌లు ద్వారా ఇంటింటికి వెళ్లి అమ్మకాలు సాగిస్తుంటారు. పట్టణ ప్రాంతాల్లో హోటల్స్‌కు కిలో రూ.150 నుంచి రూ.250 వరకు హోల్‌సేల్‌గా అందిస్తారు.

- నాణ్యతకు పెట్టింది పేరు
- ఇతర రాష్ట్రాల్లో డిమాండ్
- పట్టణాలకు ఎగుమతులు
- సీజన్‌కు తగినట్టు పచ్చళ్లు
- ఆ ఊరుకు అదే ఆధారం



ఆవకాయ పచ్చడి ముక్కలు



పచ్చళ్ల తయారీలో మహిళలు

ట్యాక్స్ మినహాయించాలి



నార్కెడిమిల్లి పచ్చళ్లను వివిధ రాష్ట్రాలకు తరలిస్తుంటాం. మధ్యలో సేల్స్ ట్యాక్స్ అధికారులు వేబిల్లులు పేరుతో ఇబ్బందులు కల్పిస్తున్నారు. సేల్స్ ట్యాక్స్ నుంచి విముక్తి కల్పించాలి.

- కొపెల్ల శ్రీరామ్, వ్యాపారి

రాయితీ రుణాలివ్వాలి..



చాలా ఏళ్లగా పచ్చళ్ల తయారీ జీవనాధారం. మాకు ముడి సరుకు కొనుగోలుకు రాయితీ రుణాలిస్తే మేమేంటో చూపిస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీ రుణాలు అందించి పరిశ్రమను ఆదుకోవాలి.

- మోటూరి షామిలి

నార్కెడిమిల్లి టూ..

నార్కెడిమిల్లిలో ఆడవాళ్లు ఏడాది పొడవునా సీజనల్ పచ్చళ్లను తయారు చేస్తుంటారు. ఆవకాయ, మావగాయ, నిమ్మకాయ, టమాటా, పండుమిర్చి, ఉసిరి, కాకరకాయ, అల్లం, చింతకాయ, దబ్బకాయ, బెల్లం ఆవకాయ, కరివేపాకు, గోంగూర, కారంపొడులను తయారు చేస్తుంటారు. మగవారంతా ఆ పచ్చళ్లను బెంగళూరు, చెన్నై, ఒడిషా, ముంబై, హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, వైజాగ్, రాయలసీమ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేసి విక్రస్తుంటారు. ఎన్నో ఏళ్లుగా వీరికిద్దే జీవనాధారం. గ్రామంలోని మగవాళ్లంతా ఈ పచ్చళ్లతో దేశవ్యాప్తంగా వ్యాపారాలు సాగిస్తారు. పండుగలు, ఎన్నికలు, శుభకార్యాలకు మాత్రమే గ్రామాలకు వస్తారు.

స్పౌజ్ పింఛన్లకు దరఖాస్తులు స్వీకరణ

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్పౌజ్ పింఛను ప్రక్రియ శనివారం నుంచి సచివాలయాల్లో ప్రారంభమైందని మంత్రి దుర్గేష్ తెలిపారు. 60 ఏళ్లు నిండి అప్పటికే పింఛను తీసుకుంటున్న భర్త 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్య కాలంలో మరణిస్తే..అతడి భార్య స్పౌజ్ పింఛనుకు దరఖాస్తుకు అర్హురాలన్నారు. భర్త, భార్య ఆధార్ కార్డులు, పింఛను పుస్తకం, రేషన్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రాల జిరాక్సు కాపీలను అందజేయాలన్నారు.పింఛను లబ్ధిదారుకాని భర్త మరణిస్తే ఆ కుటుంబానికి కొత్తగా వితంతు పింఛనుకు దరఖాస్తు చేయడానికి ఆప్షన్ రాలేదన్నారు. గతంలో పింఛను తీసుకుంటూ మరణించిన వారి భార్య మాత్రమే అర్హురాలన్నారు.

పాకిస్థానీయులు దేశం విడిచి వెళ్లాలి

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పాకిస్థానీయులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన భారత వీసాలను రద్దు చేసిన నేపథ్యంలో ఆయా వీసాలపై జిల్లాలో ఉన్న వాళ్లు దేశం వెళ్లాలని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించిందని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆదేశాలు జారీ చేసిందన్నారు. వీటి ప్రకారం సాధారణ వీసాలపై వచ్చిన వాళ్లు ఈ నెల 27(నేడు)లోపు, వైద్య వీసాలపై వచ్చిన వాళ్లు 29లోపు (మంగళవారం) తిరుగు ప్రయాణం కావాలన్నారు. ఈ నెల 30 తర్వాత అట్టారీ సరిహద్దును మూసివేస్తున్నట్లు ఇప్పటికే కేంద్రం ప్రకటించిందని గుర్తు చేశారు.పాకిస్థాన్ నుంచి ఆయా వీసాలపై భారత్‌కి వచ్చి జిల్లాలో ఉంటున్న వారిని తక్షణమే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోలను ఇప్పటికే ఆదేశించామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పరిశీలన చేశామని జిల్లాలో ఆయా వీసాలపై ఉన్న పాకిస్థానీయులు ఎవరూ లేరని పోలీసులు తెలిపారు. ఎవరైనా ఉంటే స్థానికులు సమాచారం ఇవ్వాలన్నారు.

రఘుదేవపురం సర్పంచ్ చెక్ పవర్ రద్దు

సీతానగరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : నిధులు దుర్వినియోగం నేపథ్యంలో రఘుదేవపురం సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల చెక్‌పవర్‌ను రద్దుచేసినట్టు ఎంపీడీవో ఎం.భారతి శనివారం తెలిపారు. రఘుదేవపురం పంచాయతీలో రూ1.03 కోట్లు దుర్వినియోగం అయ్యాయన్నారు. విచారణ అనంతరం గతంలో పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం సర్పంచ్ చంద్రలీల చెక్ పవర్ రద్దు చేసినట్టు డీపీవో ఉత్త ర్వులు విడుదల చేశారన్నారు.ఎంపీడీవో భారతికి పంచాయతీ చెక్ పవర్ ఇచ్చారు.



ఫిర్యాదుదారు కోలా వరలక్ష్మితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి..చిత్రంలో ఆర్డీవో రాణిసుస్మిత

అమ్మా నాన్నలను.. అనాథలను చేయవద్దు!

తమను పిల్లలు చూడడంలేదని వృద్ధ దంపతుల కేసు

- విచారించిన కలెక్టర్ ప్రశాంతి
- తల్లిదండ్రులను చూడడం బాధ్యత
- నెలకూ రూ.5 వేలివ్వాలని ఆదేశం

రాజమహేంద్రవరం/దేవరపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మా ఇద్దరు కుమారులు మమ్మల్ని చూడడంలేదని.. రోజు గడవడమే కష్టంగా మారిందని వృద్ధాప్యంలో తల్లిదండ్రులు అధికారులను ఆశ్రయించిన ఘటన ఇది. మండలంలోని యాదవోలు గ్రామానికి చెందిన కోలా వరలక్ష్మి, కృష్ణమూర్తి దంపతులకు ఇద్దరు కుమారులు.. ఇద్దరినీ పెంచి పెద్ద చేసి పెళ్లిళ్లు కూడా చేశారు.వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో దంపతులిద్దరికీ ఇబ్బందికరంగా మారింది. ఈ మేరకు తమను ఇద్దరు కుమారులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ సీనియర్ సిటిజన్ చట్టం కింద వయోవృద్ధుల పోషణ, సంక్షేమ ట్రైబ్యునల్‌లో పిటిషన్ వేశారు. రాజమహేంద్ర వరం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో ఆర్డీవో రాణిసుస్మిత ఫిర్యాదుదారులైన కోలా వరలక్ష్మి, కృష్ణమూర్తి దంపతుల సమక్షంలో కేసు విష యమై కోర్టు నిర్వహించారు.గతంలో జారీ చేసిన ఉత్తర్వుల అమలుపై సమగ్ర నివేదిక ఆధారంగా విచారణ చేపట్టడం జరిగింద న్నారు. తల్లిదండ్రులను వృద్ధాప్యదశలో చూడకపోవడం దారుణమన్నారు.ఈ రోజు వృద్ధులయ్యారని ఇలా వదిలేస్తున్నారని..పిల్లలను చిన్నతనంలో వదిలేస్తే ఏమైపోయేవారని ప్రశ్నించారు. వృద్ధులైన తల్లిదండ్రులను నిర్లక్ష్యంగా వదిలివేయడం తగదన్నారు. ఇద్దరు పిల్లలు ప్రతి నెల రూ.5 వేలు చొప్పున చెరో రూ.2500 చెల్లించాలని ఆదేశించారు. ఇది అమలయ్యేలా చూడాలని ఆర్డీవోకి సూచిం చారు.వృద్ధులైన తల్లిదండ్రులను భారంగా భావించవద్దన్నారు.



ఆదుకోండయ్యా..

అప్పటి వరకూ తమకు నీడనిచ్చిన గూడు అగ్నికి ఆహుతైంది.. దీంతో 3 కుటుంబాలు నిరాశ్రయులయ్యారు..బాధితులను పరామర్శించడానికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వెళితే ఇలా ఆదుకోండయ్యా అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. - వివరాలు 8లో

అధికారుల అప్రమత్తం

జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో అధికారు లు అప్రమత్తమయ్యారు. ఎక్కడికక్కడ తనిఖీలు ముమ్మరం చేశారు.జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశాలతో శనివారం విమానాశ్రయం, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, పెట్రోలు బంకులు తదితర చోట్ల తూర్పు గోదావరి పోలీసులు శనివారం సేఫ్టీ, సెక్యూరిటీ ప్రమాణాలను పరిశీలించారు. నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన చర్యలు, సీసీ కెమెరాల పని తీరు, అసాంఘిక శక్తుల కదలికలు, అత్యవసర ప్రవేశ, నిర్గమ మార్గాలు, అగ్నిమాపక ఏర్పాట్లు వంటి వాటిపై సమీక్షించారు. మరింత మెరుగైన చర్యలు తీసుకునే అవసరతపై ఆరా తీశారు. ఎక్కడా ఎటువంటి పొర బాట్లకు తావివ్వొద్దని.. నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లోనూ ముమ్మర తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(ఏఆర్) ఎల్.చెం చిరెడ్డి, ఎస్బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ఏఆర్ డీఎస్పీ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విమానాశ్రయం, రైల్వే స్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

గోదావరి జలాలు.. కలుషితం కాకుండా చూడాలని వినతి


చైర్‌పర్సన్ రత్నకుమారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొవ్వూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గోదావరి జలాలు కలుషితం కాకుండా, పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ ఛైర్మన్ నంబూరి శ్రీహర్షవర్ధన్ కోరారు. ఈ మేరకు శనివారం కొవ్వూరు మున్సిపల్ ఛైర్మన్ బావన రత్నకుమారి, కమిషనర్ టి. నాగేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ ఛైర్మన్ నంబూరి శ్రీహర్షవర్ధన్, జనరల్ సెక్రటరీ గండి హరి సత్యసాహిత్ మాట్లాడుతూ గోదావరి నదీ పరీవాహక ప్రాంతం గోష్పాదక్షేత్రంలో నదీజలాలు కలుషితం కాకుండా, ప్లాస్టిక్ కవర్లు, షాంపులు వాడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు వినతి అందజేశారు.

వేసవిలో దొంగతనాలపై అప్రమత్తత అవసరం : సీఐ

కొవ్వూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వేసవిలో దొంగతనాలు అధికంగా జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొవ్వూరు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు. వేసవిలో సొంత గ్రామాలకు, పెళ్లిళ్లు, యాత్రలకు వెళ్లేవారు విలువైన బంగారు, వెండి వస్తువులు, నగదు ఇంట్లో ఉంచి వెళ్లరాదన్నారు. అలాగే నగదు, బంగారు, వెండి వస్తువులతో ప్రయాణం చేసేవారు బస్సులు, రైళ్లలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితులు, అనుమానితులతో మాట్లాడడం, వారు ఇచ్చే తినుబండారాలు తినడం వంటివి చేయరాదన్నారు.

24 గంటలూ సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలన్నారు. ఎవరైనా అనుమానంగా తిరుగుతూ ఉంటే స్థానిక పోలీసులకు గానీ, డయల్ 100కు లేదా 112 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.

యాదవోలులో మెగా క్రికెట్ టోర్నీ ప్రారంభం


క్రీడలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు నిర్వహించటం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు. యాదవోలులో శనివారం మెగా క్రికెట్ టోర్నీను ఎమ్మెల్యే బ్యాటింగ్, బౌలింగ్ చేసి ప్రారంభించారు. ఆర్గనైజర్స్ వీరశెట్టి రామకృష్ణ, అనిశెట్టి అప్పారావు, కొమ్మిరెడ్డి పవన్‌కల్యాణ్, ఎలికే నాగశ్రీను జిల్లా స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఒక టీమ్‌లో ఆడేవారు వేరొక టీమ్‌లో ఆడరాదన్నారు. జట్టు సభ్యులంతా ఒకే ఊరు వారై ఉండాలన్నారు. ఇందులో విన్నర్స్ ప్రైజ్ మనీ రూ. 55,555, రన్నర్స్ ప్రైజ్‌మనీ రూ.22, 222, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ 5,555గా నిర్ణయించినట్టు చెప్పారు. కార్యక్రమంలో గోపాలపురం నియోజక వర్గ జనసేన ఇన్‌చార్జి సువర్ణరాజు, సీఐ నారాయణ్ నాయక్, టీడీపీ మండల అధ్యక్షుడు అంద్రూ అనీల్ టీడీపీ, జనసేన నాయకులు యర్రగోల్ల అంజిబాబు, అనిశెట్టి గంగరాజు, అనిశెట్టి శ్రీనివాస్; దేవిప్రసాద్, అనిశెట్టి మధు, కాసాని ప్రతాప్, అంకేం పెదబాబు, సర్పంచ్ ఎస్.వరప్రసాద్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

చాగల్లు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలటూరుకు చెందిన కేశవరపు శ్రావణి (17) ఇంట్లో ఎవరికీ చెప్పకుండా శుక్రవారం బయటకు వెళ్లిపోయింది. దీంతో కంగారుపడ్డ ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనికి సంబంధించి ఎస్‌ఐ కే.నరేంద్ర వివరాలు వెల్లడిస్తూ... శ్రావణి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో అన్నిచోట్లా వెతికినా ఆచూకీ లభించకపోవడం వల్ల ఆమె తల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

● అందుకు పాలక సభ్యులు, అధికారులు , ప్రజలు సహకరించాలి ● కౌన్సిల్‌లో చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి పాలక వర్గ సభ్యులు, అధికారులు, ప్రజలు పరస్పర సహకారం అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి కోరారు. కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ కౌన్సిలర్ పిల్లమర్రి మురళీకృష్ణ కాశ్మీర్ ఘటనలో మృతులకు నివాళులు అర్పించాలని కోరడంతో రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. అనంతరం టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని మాట్లాడుతూ మార్కెట్‌ను రుడా నిధులతో అభివృద్ధి చేయనున్న సందర్భంలో బాపూజీ కూరగాయల మార్కెట్, రహదారి బంగ్లా వద్ద నున్న పురపాలక సంఘం షాపుల లీజు, అద్దె పెంపు ప్రతిపాదనలు పరిశీలించాలని సూచించడంతో ఆ అంశాన్ని వాయిదా వేశారు. అలాగే మెప్మా ఆధ్వర్యంలో చేపట్టనున్న పభ్రుత్వ కార్యక్రమాలను కౌన్సిల్‌కి వివరించాలని కోరారు. వైసీపీ ఫ్లోర్‌లీడర్ కోడూరి శివరామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ప్రభుత్వకాలనీలలో ప్రత్యేక ప్రణాళిక ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కమిషనర్ టి. నాగేంద్రకుమార్ మాట్లాడుతూ పట్టణంలోని బాపూజీ కూరగాయల మార్కెట్ లోపలి భాగంలో షెడ్లను తొలగించి మార్కెట్ అభివృద్ధి చేయడానికి రుడా నిధులు రూ. ఐదు కోట్లతో జీప్లస్ 1 షాపులు నిర్మాణం చేపట్టడానికి అధికారులు ప్రతిపాదనలు తయారు చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా ఆస్తిపన్ను వసూళ్లలో రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలవడంపై సచివాలయ అడ్మిన్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌కుమార్, మేనేజర్ పి. సాయిబాబులను చైర్‌పర్సన్ రత్నకుమారి, కమిషనర్ నాగేంద్రకుమార్ శాలువాలు కప్పి సత్కరించారు. సమావేశంలో 2వ వార్డు బీసీ వసతి గృహం వెనుక మున్సిపల్ స్థలం మెరక చేసే పనులు, మున్సిపల్ షాపుల లీజు కాలం పెంపు అంశాలను వాయిదా వేస్తున్నట్లు చైర్‌పర్సన్ రత్నకుమారి ప్రకటించారు. కార్యక్రమంలో వివిధ వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రత్నకుమారి


సమావేశానికి హాజరైన మున్సిపల్ కౌన్సిలర్లు

‘విభిన్న రంగాల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలి’


శామ్యూల్ రిచర్డ్సన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు

నల్లజర్ల ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు విభిన్న రంగాల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు అన్నారు. ఆవపాడుకి చెందిన గురుజు డానియేల్ కుమారుడు శామ్యూల్ రిచర్డ్సన్ వెంకట్రామన్నగూడెంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతూ గత ఏడాది డిసెంబరు 1వ తేదిన ఒకే సామాజిక మాధ్యమం ద్వారా 18 దేశాల నుంచి 1046 మంది పాల్గొన్న ఎలాక్ట్రానిక్ మ్యూజిక్ కీబోర్డులో పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించాడు. దీనికి సంబంధించి మెమొంటోలు, సర్టిఫికెట్లను శుక్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో హలేట్ మ్యూజికల్ డైరెక్టర్ ఆగస్టన్ చేతులమీదుగా శామ్యూల్ అందుకున్నాడు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే మద్దిపాటి నల్లజర్ల టీడీపీ కార్యాలయంలో శామ్యూల్‌ను అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్‌మీరా సాహెబ్, కూచిపూడి ఉదయ భాస్కరరావు, లంకా సత్యనారాయణ, రొంగల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లులో వాహన తనిఖీలు

చాగల్లు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పెహల్గామ్‌లో జరిగిన ఉగ్ర దాడి నేపథ్యంలో అనుమానాస్పద వ్యక్తుల సమాచారం కోసం స్థానిక సెంటర్‌లో ఎస్‌ఐ కే.నరేంద్ర ఆధ్వర్యంలో శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. సుమారు వందకు పైగా వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. ఎవరైనా అనుమానితులు కనిపించినట్టుయితే ఫోన్ చేయాలని ఎస్‌ఐ సూచించారు.

బీమా పథకాలకు దరఖాస్తు చేసుకోండి


అచ్చన్నపాలెంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ నాగమల్లేశ్వరరావు

నల్లజర్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి పథకాలకు ఉపాధి కూలీలు దరఖాస్తు చేసుకోవాలని ఉపాధి హామీ పీడీ నాగమల్లేశ్వరరావు అన్నారు. శనివారం అచ్చన్నపాలెం, పుల్లలపాడులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను పూర్తిచేసి ఫీల్డ్‌అసిస్టెంట్ల ద్వారా బ్యాంకులకు ఈనెల 28వ తేదీలోపు అందించాలన్నారు. ఈయనవెంట ఏపీవో వెంకట్రావు, టీఏ శ్రీనివాస్, సందీప్, రాఘవ ఉన్నారు.

అక్రమ రవాణాను సహించేది లేదు


జాతీయ రహదారి కరిచర్లగూడెం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

గోపాలపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అక్రమ రవాణాను సహించేది లేదని దేవరపల్లి సీఐ నాగేశ్వర్ నాయక్ వాహనదారులను హెచ్చరించారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు జాతీయ రహదారి 516డీ కరిచర్లగూడెం జంక్షన్ వద్ద నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా వాహనాలను తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏకకాలంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించామన్నారు. మండలంలోని కరిచర్లగూడెం జంక్షన్ వద్ద 223 వాహనాలను తనిఖీ చేసినట్టు చెప్పారు. వీరిలో ఇద్దరు లారీడ్రైవర్లు, కార్లు నడిపేవారు మద్యం సేవించినట్టు నిర్ధారించామన్నారు. వీరిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ కే.సతీశ్‌కుమార్ ఉన్నారు.

డీఎస్సీ ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన కాపు అభ్యర్థులు (కాపు, బలిజ, తెలగ, ఒంటరి) డీఎస్సీ 2025 ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ల కోసం ఆన్‌లైన్‌లో శిక్షణ కోసం ఈనెల 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకుడు ఏ. శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులు ఈనెల 25 నుంచి స్వీకరిస్తున్నట్టు చెప్పారు. హెచ్‌టీటీపీఎస్:// ఎండీఎఫ్‌సీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

29న పరశురామ్ పురస్కారాలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పరశురామ్ జయంతి సందర్భంగా విశేష కృషిచేసిన బ్రాహ్మణులకు ఈనెల 29న లలితానగర్‌లోని భార్గవ కల్యాణ మండపంలో పరశురామ్ పురస్కారాలను అందజేస్తున్నట్లు పురస్కారాల కమిటీ చైర్మన్ దూర్వాసుల సత్యనారాయణ తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కును అందజేస్తున్న ఆంధ్రా సుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు)

కొవ్వూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు నాణ్యతతో కూడిన విద్య, వైద్యం అందించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రాసుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు)అన్నారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శనివారం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 9,31,761 లక్షల విలువ గల తొమ్మిది చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనిమిల్లి రాజేంద్రప్రసాద్‌కు రూ. 1,11,995, గొర్లి మంజుభార్గవికి రూ. 1,20,000, గరగ నాగవెంకట త్రిమూర్తికి రూ. 1,82,366, నేమారపు నూకరత్నంకు రూ. 20,000, కాలా రామకృష్ణకు రూ. 95,166, నరకుల నగరమ మునిప్రకాష్‌కు రూ. 31,377, బండారు శ్రీగౌరీకి రూ. 2,18,887, బొల్ల శ్రీనివాస్‌కు రూ. 71,804, పెద్దాడ సత్యనారాయణకు రూ. 25,166 అందజేశారు. అలాగే దొమ్మేరుకు చెందిన పెండ్యాల సుజాతకు రూ. 1,40,436 చెక్కులను ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, యాగంటి చలపతి, తోరం నగేష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీలు..

షరామామూలే!

● కలెక్టర్ ఆదేశాలూ బేఖాతరు



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఇసుక వ్యాపారులు అధికారుల ఆదేశాలకు పెద్దగా పట్టించుకోనట్టు పరిస్థితులు కనిపిస్తున్నాయి. లారీల్లో పీకల వరకూ ఇసుక నింపుకొని వెళుతున్నా ఆయా ప్రభుత్వ శాఖలకు కానరాకపోవడం వారి తెగింపునకు ఊతమిస్తోంది. లారీలో ఇసుకను డ్రైవర్ క్యాబిన్‌లో తప్ప నిండా నింపేస్తున్నారు. ఇంకొక్క గుప్పెడు ఇసుక కూడా పట్టని విధంగా కక్కుర్తిని ప్రదర్శి స్తున్నారు. అయితే వారి సంపాదన యావ ఎలా ఉన్నా.. ఆ నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలను తీసే అవకాశం ఉంది. ఇసుకను నిబంధనలతో సంబంధం లేకుండా పూటుగా లోడు వేస్తుండడంతో ప్రయాణంలో రోడ్డుపై వలిగిపోతోంది. రోడ్డు మధ్యల్లో, చివర్ల ఇసుక పొరలా పరుచుకుంటోంది. వాహనదారులు ఏ మాత్రం అప్రమత్తతను క్షణంపాటు వదలేసినా ప్రమాదం తప్పకపోవచ్చు. రోడ్డుపైన ఇసుకలో ద్విచక్ర వాహనాలు జారి(స్కిడ్) ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలు ఇతర జిల్లాల్లో ఉన్నాయి. పైగా ఓవర్ టన్నేజీతో వెళుతున్న ఇసుక లారీలకు తగినట్లుగా ఆయా రహదారుల సామర్థ్యం ఉందా? అనేది కూడా ప్రశ్నార్థకమే. సాధారణ ప్రజానీకం ప్రభుత్వాన్ని నిందిస్తుండగా.. అధికార పార్టీ వ్యాపారుల హుకుంలకు యంత్రాంగం తలొగ్గుతుందనే విమర్శలున్నాయి.ఓ రెండునెలల క్రితం లారీలు తీరు ఇలాగే ఉండడంతో కలెక్టర్ ప్రశాంతి గట్టిగానే హెచ్చరించారు. జరిమానాలు విధించాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ఆ అధికారుల కొద్ది రోజుల హడావుడికి ఇసుకకు పూర్తిగా వస్త్రం కప్పారు. హల్‌చల్ కాస్త చల్లారిన తర్వాత పరిస్థితి మళ్లీ షరా మామూలుగానే మారింది. డ్రైవరు క్యాబిన్‌పై ఉన్న జాగాను కూడా వదలడం లేదు. దీంతో ఇసుక రోడ్డుపై సన్నని ధారలా పడుతోంది. ఆ లారీ వెనుక వచ్చే వాహనదారుల కళ్లల్లో ఆ ఇసుక పడుతుండడంతో అసౌకర్యానికి గురౌతున్నారు. అసలు అంత మేటల్లా లారీల్లో ఇసుక సిటీ రోడ్లపై సైతం వెళుతుంటే యంత్రాంగానికి కాస్త కూడా కానరాకపోవడం విడ్డూరమంటూ జనం నివ్వెరపోతున్నారు. అయితే, ఒకవేళ కఠిన చర్యలు తీసుకుంటుంటే.. సీఎం చంద్రబాబు ఇసుకను సులభతరం చేసినా జిల్లాలో కష్టపెడుతున్నారంటూ ఇసుక వ్యాపారులు సీఎం కార్యాలయ స్థాయిలో పలుకుబడి ఉపయోగించి అక్కడి నుంచి ఇక్కడకు ఫోన్లు చేయించేసుకొని అధికారులు కళ్లు మూసుకు నేలా చేస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఏదేమైనా ప్రజలకు ఏదోక కీడు జరగకముందే జాగ్రత్త చర్యలు తీసుకుంటే మేలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



మాదక ద్రవ్యాల వాడకంతో..

కుటుంబాలు నాశనం


సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ మురళీ కృష్ణ

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వాడకం వల్ల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతినడమే కాకుండా, కుటుంబాలు నాశనమవుతాయని అడిషనల్ ఎస్పీ (పరిపాలన) ఎన్‌బీఎం మురళీకృష్ణ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, ఎలైట్ యాంటీ నార్కొటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్) ఆధ్వర్యంలో నిషేధిత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, అలవాటును మానుకొనే పద్ధతులపై శనివారం ఖైదీలకు నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్నగా, స్నేహితుల ప్రోద్బలంతో మొదలు పెట్టి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారన్నారు. బతుకులను బుగ్గిపాలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సులభంగా డబ్బు సంపాదన కోసం చట్ట వ్యతిరేక మార్గాలను ఎంచుకుంటున్నారని, అలాంటి వాళ్లు ఏనాటికైనా శిక్ష అనుభవించకతప్పదని ఎన్నో ఘటనలు రుజువు చేశాయన్నారు. మాదక ద్రవ్యాల కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న వాళ్లు.. విడుదలై వెళ్లిన తర్వాత తాము అనుభవించిన కష్టాలను, కుటుంబంతో గడపకుండా కోల్పోయిన జీవితాన్ని సమాజానికి తెలియజేయాలన్నారు. మాదక ద్రవ్యాల వల్ల యువత నాశనం అవుతుందని జిల్లా ఎక్సైజ్ అధికారి లావణ్య అన్నారు. కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్. రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మనసు ఎప్పుడూ మన ఆధీనంలో ఉంటే చెడు వ్యసనాలకు దూరంగా ఉండొచ్చని జిల్లా అడిషనల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పీఎన్ రాహుల్ అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వాళ్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, డీఎడిక్షన్ సెంటర్ల ద్వారా ప్రభుత్వం అందించే ఉచిత వైద్యం పొంది కోలుకోవచ్చన్నారు. నిషేధిత మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల సూచనలతో విస్తృతంగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. తమ అనుభవాలను ఖైదీలు కొందరు స్వయంగా సదస్సులో వివరించారు. విడుదలైన తర్వాత వాటి జోలికి వెళ్లబోమని, అలవాటు ఉన్నవారిని మంచిగా మారే విధంగా చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.సుబ్బరాజు, డీఎస్.రత్నరాజు, జైలు ఉపాధ్యాయుడు చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పశ్చిమగోనగూడెంలో మూడు తాటాకిళ్లు దగ్ధం

● ఎమ్మెల్యే బత్తుల, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారుల పరిశీలన

● నిరాశ్రయులకు రూ.10 వేల నగదు, దుస్తులు పంపిణీ


కాలిపోయిన ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలం పశ్చిమగోనగూడెంలో గత అర్ధరాత్రి ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో మూడు తాటాకిళ్లు పూర్తిగా దగ్ధం కాగా, నాలుగు కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఓదార్చారు. టేకుమూడి మహాలక్ష్మి ఇంట్లో ముగ్గురు దివ్యాంగులు, ఒనుం నాగు, ఒనుం శ్రీను సర్వం కోల్పోయారు. ఘటనాస్థలం పక్కనే అద్దెకు ఉంటున్న వారి ద్విచక్ర వాహనం కూడా కాలిపోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగింది. రెండు అగ్నిమాపక వాహనాలు వచ్చి మంటలను అదుపుచేశాయి. స్థానికుల సహాయంతో అతికష్టం మీద ప్రాణాలతో బయట పడ్డారు. వీరందరికీ కూలి పనే జీవనాధారం. బాధితులందరికీ ప్రభుత్వం తరుపున నష్టపరిహారాన్ని అందించే ఏర్పాటు చేస్తామని, ఇళ్లు నిర్మించడానికి లోన్లు ఇప్పిస్తామని ఎమ్మెల్యే బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. తక్షణ సహాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.10వేలు చొప్పున అందజేశారు. అలా గే జనసేన పార్టీ కో ఆర్డినేటర్ బత్తుల వెంకట లక్ష్మి ఇళ్లు కోల్పోయిన వారిని పరామర్శించారు. బాధిత కుటుంబాలకు చీరలు, దుప్పట్లు అందజేశారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్ రొంగల దేవిక శ్రీనివాస్, కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మిసరోజ వీరగణేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తనకాల నాగేశ్వరరావు, జనసేన నాయకులు అడ్డాల శివ, బదిరెడ్డి దొర, మాజీ సర్పంచ్ కుంచు చల్లారావు, బొమ్ముల గంగరాజు, మేడిశెట్టి రాంబాబు, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ఉన్నారు.